
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
శనివారం 24 మే 2025



బియ్యం పంపిణీకి సిద్ధంగా ఉండండి

- డీలర్లకు డీఎస్‌వో సూచన

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఒకటో తేదీ నుంచి బియ్యం కార్డుదారులకు సరకులు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని రేషన్ డీలర్లకు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి కె.భాస్కర్ సూచించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో డీలర్లతో ఆయన సమావేశమయ్యారు. సరకుల పంపిణీకి సంబంధించి రికార్డులు, తూకం యంత్రాలు, ఈపోస్ మిషన్లు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్డుదారులకు ఇబ్బందులు లేకుండా వారితో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించాలన్నారు.



జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మినీ మహానాడులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు. వేదికపై ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, కోరాడ రాజబాబు, సీతంరాజు సుధాకర్, అక్కరమాని విజయనిర్మల, పట్టాభి, ఇతర నాయకులు ఉన్నారు.

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

సంస్కరణలకు చంద్రబాబునాయుడు...

- బాబు హయాంలో సంస్థాగతంగా పార్టీ బలోపేతం
- కార్యకర్తల సంక్షేమానికి నిధి ఏర్పాటుచేసిన ఘనత లోకేశ్‌కే దక్కుతుంది
- మినీ మహానాడులో ఎమ్మెల్యే గంటా
- చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి: ఎమ్మెల్యే గణబాబు
- పంచగ్రామాల భూ సమస్య పరిష్కారానికి తీర్మానం

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమాన్ని పరిచయం చేసింది తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావేనని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మినీ మహానాడు నిర్వహించారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గంటా, గణబాబు, బాబ్జీ

తొలుత నందమూరి తారకరామారావు విగ్రహానికి, మాజీ ఎంపీ పెతకంశెట్టి అప్పలనరసింహం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గంటా మాట్లాడుతూ ఎన్టీఆర్ తరువాత పగ్గాలు చేపట్టిన చంద్రబాబునాయుడు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ఎంతో కృషిచేశారన్నారు. అటు ప్రభుత్వం, ఇటు పార్టీలో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. మూడో తరంలో లోకేష్ ప్రపంచంలోనే ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా కార్యకర్తల సంక్షేమానికి నిధి ఏర్పాటుచేశారన్నారు. పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి తీర్మానాన్ని ప్రతిపాదించగా అందరూ ఆమోదించారని, ఇదే అంశం కడప మహానాడులో ప్రస్తావిస్తామన్నారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ సింహాచలం పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారం అవుతుందని, కోర్టు కేసుకు త్వరలో మోక్షం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ముడసర్లోవ పరిసరాల్లో రైల్వేకు 52 ఎకరాలు ఇచ్చారని, ఆ భూముల్లో ఉన్న నిరుపేదలకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. మెట్రో రైలుకు వచ్చే అక్టోబరులో ... మిగతా 6వ పేజీలో

ఉక్కులో బిక్కు బిక్కు

వరుస ప్రమాదాలతో కార్మికుల్లో ఆందోళన

- ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులను కుదించడంతో అనేక విభాగాల్లో సిబ్బంది కొరత
- నామమాత్రంగా సాగుతున్న నిర్వహణ పనులు
- తరచూ ప్రమాదాలకు అదే కారణమనే వాదన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్ ప్లాంటులో ఇటీవల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. యాజమాన్యం ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను తగ్గిస్తూ అనేక విభాగాలను అతి తక్కువ సిబ్బందితో నడుపుతోంది. నిర్వహణ పనులు నామమాత్రంగానే చేస్తున్నారు. దాంతో ప్రమాదాలు పునరావృతమవుతున్నాయి. ప్రమాదం జరిగిన ప్రతిసారి కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోంది.

తాజాగా స్టీల్ మెల్టింగ్ షాప్ (ఎస్ఎంఎస్)-2లో హైడ్రాలిక్ ఆయిల్ లీక్ అయి అగ్ని ప్రమాదం సంభవించింది. పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. అక్కడ ఉత్పత్తి ఆగిపోయింది. ఆయిల్‌కు బదులుగా గ్యాస్ లీకై ఉంటే మరింత పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తంచేశాయి. నిర్వహణ పనులకు అవసరమైనంత సిబ్బందిని సమకూర్చకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని విమర్శలు వస్తున్నాయి. వారం రోజుల ముందు 300 టన్నుల హాట్ మెటల్ నేలపాలైంది. ఇది ఆపరేషన్లలో వైఫల్యం వల్లనే జరిగింది. నైపుణ్యం కలిగిన సిబ్బంది లేకపోవడం వల్ల అప్పుడు ప్రమాదం చోటుచేసుకుంది. మూడు నెలల క్రితం సింటర్ ప్లాంటులో కన్వేయర్ బెల్ట్ కూలిపోయి భారీనష్టం వాటిల్లింది. బెల్ట్‌పై పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించకపోవడం వల్ల బరువును తట్టుకోలేక బెల్ట్ కిలోమీటరు పొడవున తెగింది. ఇది కూడా నిర్వహణ లోపమే. తాజాగా శుక్రవారం జరిగిన ప్రమాదం గురించి విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌లు వివరాలు తెలుసుకున్నారు. ఢిల్లీలో ఉన్న సీఎం చంద్రబాబునాయుడుకు తెలియజేశారు. మంచి అధికారులను నియమిస్తే తప్ప ఇక్కడ పరిస్థితులు చక్కబడే ... మిగతా 6వ పేజీలో



ఎస్ఎంఎస్-2 విభాగంలో కేబుళ్లు కాలిపోవడంతో ఎగిసిపడుతున్న మంటలు

ఎస్ఎంఎస్-2లో అగ్ని ప్రమాదం

ఉక్కుటౌన్‌షిప్, మే 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులోని స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్)-2 విభాగంలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కేబుళ్లు, యంత్ర సామగ్రి దగ్ధం కావడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎస్ఎంఎస్-2 విభాగంలో నాలుగు కంటిన్యూ కాస్టింగ్ మెషీన్లు (సీసీఎం) ఉంటాయి. మూడింటిలో నిరంతరం ఉత్పత్తి సాగుతుంటుంది. ఒకటి స్టాండ్ బై గా ఉంటుంది. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు యథావిధిగా ఉత్పత్తి జరుగుతుండగా రెండో మెషీన్‌కు సంబంధించిన ట్యాంకు నుంచి హైడ్రాలిక్ ఆయిల్‌ను ఇతర భాగాలకు సరఫరా చేసే పైప్ లీకైంది. అత్యంత వేడిగా ఉండే హైడ్రాలిక్ ఆయిల్ కింద ఉన్న కేబుళ్లపై పడడంతో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి.

కేబుళ్లు, యంత్ర సామగ్రి దగ్ధం

ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు వ్యాపించడంతో విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో కేబుళ్లు, హైడ్రాలిక్ హోస్‌పైపులు కాలిపోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు విభాగానికి విద్యుత్ సరఫరా ఆపేశారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని ఉద్యోగులు తెలిపారు. ఇదిలావుండగా ఎస్ఎంఎస్-2 విభాగంలో స్వల్ప అగ్నిప్రమాదం జరిగిందని, ఎటువంటి ఉత్పత్తి, ప్రాణ నష్టం జరగలేదని, అతి తక్కువ సమయంలో మళ్లీ పునరుద్ధరణ చర్యలు చేపట్టామని ఉక్కు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.

కరోనా టెన్షన్

నగరంలో పాజిటివ్ కేసు నమోదు కావడంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ

- కేజీహెచ్‌లో 40 పడకలు, విమ్స్‌లో 20 పడకలతో ప్రత్యేక వార్డులు ఏర్పాటు
- అనుమానిత లక్షణాలు ఉన్నవారికి అర్బన్ హెల్త్ సెంటర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ర్యాపిడ్ పరీక్షలు
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతున్న వైద్యులు



విమ్స్‌లో సిద్ధం చేసిన కరోనా ప్రత్యేక వార్డు

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ మళ్లీ వ్యాప్తి చెందుతుండడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ఆరోగ్య శాఖ ఆదేశాలతో జిల్లా అధికారులు కేజీహెచ్, విమ్స్‌లలో ప్రత్యేకంగా ఐసోలేషన్ వార్డులను ఏర్పాటుచేశారు. కేజీహెచ్ క్యాజువాల్టీ మొదటి అంతస్తులో 20 పడకలతో వార్డును సిద్ధం చేశారు. పాత బ్లడ్ బ్యాంకుపై మరో 20 పడకలతో వార్డు ఏర్పాటుచేయనున్నారు. అలాగే కరోనా వైరస్ లక్షణాలతో వచ్చే వారికి పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విమ్స్‌లో కూడా 20 పడకలతో ఐసోలేషన్ వార్డును ఏర్పాటుచేశారు. అవసరాన్ని బట్టి షిఫ్టుల వారీగా పనిచేయాల్సి ఉంటుందని వైద్యులకు, నర్సింగ్ సిబ్బందికి ఇప్పటికే సమాచారాన్ని ఇచ్చారు.

కరోనా లక్షణాలతో బాధపడే వారికి నగర పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్స్‌తోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం 50 చొప్పున కిట్స్‌ను అందిస్తున్నట్టు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు వెల్లడించారు. ర్యాపిడ్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చిన వారికి కేజీహెచ్‌లో ఆర్‌టీపీసీఆర్ పరీక్ష నిర్వహించ నున్నారు.

కొవిడ్‌లో కొత్త వేరియంట్

కరోనా వైరస్ విభిన్న రకాలుగా మార్పు చెందుతూ వస్తోంది. ఒక్కోసారి ఒక్కో రకమైన వేరియంట్ వ్యాప్తి చెందుతోంది. ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న వేరియంట్ 2023లో అమెరికా, యూరప్‌లలో కేసుల నమోదుకు కారణమైన ఒమిక్రాన్ రకానికి చెందినదిగా వైద్యులు చెబుతున్నారు. ఒమిక్రాన్ మార్పులు చెంది 30 మ్యుటేషన్లుగా విస్తరించింది. ఇందులో ప్రస్తుతం జేఎన్ 1 వేరియంట్‌కు చెందిన ఎల్ఎఫ్ 7, ఎన్‌బీ 1.8 వ్యాప్తి చెందుతున్నట్టు చెబుతున్నారు. ఈ రెండు ... మిగతా 6వ పేజీలో

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష రేపు

నగరంలో 8,424 మంది అభ్యర్థులు

- 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్
- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు
- అభ్యర్థులు అరగంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలి
- ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువెళ్లకూడదు



విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25వ తేదీన సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హారేంధిరప్రసాద్ ఆదేశించారు. మొత్తం 19 కేంద్రాల్లో 8,424 మంది పరీక్షకు హాజరవుతారన్నారు. ప్రతి కేంద్రంలో అభ్యర్థులకు తాగునీరు తదితర వసతులు కల్పించాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో జామర్లు ఏర్పాటుచేయాలని బెల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. యూపీఎస్సీ నిర్వహించే ఈ పరీక్షకు సంబంధించి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఏమరుపాటు పనికిరాదని హెచ్చరించారు. పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్, స్థానిక అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యగా కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ (0891-2590100, 0891-2590102) ఏర్పాటుచేశామన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి సందేహాలుంటే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు జరుగుతుందన్నారు. అభ్యర్థులు అరగంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకు రాకూడదని కలెక్టర్ స్పష్టంచేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఐడీ కార్డు తీసుకురావాలని, ఒకవేళ కార్డు తీసుకురాకపోతే సెల్ఫ్‌డిక్లరేషన్‌ఫారం సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, యూపీఎస్సీ డైరెక్టర్ పట్నాయక్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అటకెక్కిన విచారణ!?

ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై విచారణ జరిపిస్తామని రెండు నెలల కిందట అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి నారా లోకేశ్

- ఇప్పటివరకూ ప్రారంభమే కాని వైనం
- ఆ ఊసే పట్టని స్థానిక కూటమి నేతలు



పీవీజీడీ ప్రసాదరెడ్డి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి తీసుకున్న నిర్ణయాలపై విచారణ జరిపిస్తామని అసెంబ్లీ వేదికగా మంత్రి నారా లోకేష్ చేసిన ప్రకటన ఇంకా కార్యరూపం దాల్చలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రసాదరెడ్డి అనేక అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయన వీసీగా ఉన్న సమయంలో తీసుకున్న అనేక నిర్ణయాలపై తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన నాయకులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత ప్రసాదరెడ్డిపై విచారణ చేయిస్తామని ప్రకటించారు. అయితే, దాదాపు తొమ్మిది నెలలు ఆయనపై చర్యలు తీసుకోకపోవడంతో రెండు నెలల కిందట అసెంబ్లీలో నగరానికి చెందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు వంటి వారంతా ప్రసాద రెడ్డి వ్యవహారాన్ని ప్రస్తావించారు. దీంతో అసెంబ్లీ వేదికగా మంత్రి నారా లోకేష్ స్పందించారు. రెండు నెలల్లో మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై విజిలెన్స్ విచారణ పూర్తిచేసి చర్యలు తీసుకుంటామని మార్చి రెండో వారంలో ప్రకటించారు. అయితే, ఇప్పటి వరకూ విజిలెన్స్ విచారణను చేపట్టలేదు. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో ప్రసాదరెడ్డి సంగతి తేలుస్తామంటూ మాట్లాడిన కూటమి నేతలు ఇప్పుడు సైలెంట్ అయిపోవడం కూడా అనేక అనుమానాలకు తావిస్తోంది.

ఆరోపణలు అనేకం

మాజీ వీసీ ప్రసాదరెడ్డి హయాంలో అనేక అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. రూ.20 కోట్ల రూసా నిధులు వినియోగం, ఇస్రో నుంచి వచ్చిన రూ.25 లక్షల ఖర్చులో నిబంధనల ఉల్లంఘించారనే విమర్శలు వచ్చాయి. అలాగే పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు భారీ వేతనాలతో ఉద్యోగాల కల్పన, రిటైర్డ్ ప్రొఫెసర్లకు అడ్డగోలుగా పదవులు, అర్హత లేని వారికి ఉన్నత పదవులు ఇవ్వడం, టీడీఆర్ హబ్ ద్వారా పీహెచ్‌డీ ప్రవేశాల్లో అక్రమాలు, నార్త్ క్యాంపస్ పరిధిలో భారీవృక్షాల తొలగింపు వంటి అంశాల్లో అవకతవకలు చోటుచేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటి కైనా విచారణ దిశగా అడుగులు వేస్తుందో, లేదో చూడాలి.

డీఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

- దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల నిరీక్షణ గదులు, ప్లాట్‌ఫామ్‌లపై పారిశుధ్యం పరిశీలన



దువ్వాడలో అధికారులతో చర్చిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు రైల్వే సైడింగ్, దువ్వాడ స్టేషన్‌లో డీఆర్ఎం లలిత్ బొహ్రా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గురువారం అర్ధరాత్రి స్టీల్‌ప్లాంట్ రైల్వే సైడింగ్‌లో పర్యటించి భద్రతా ప్రమాణాలు, సురక్షితంగా విధుల నిర్వహణ, కార్యకలాపాలకు అవసరమైన లైటింగ్, ఇతర సదుపాయాలను పరిశీలించారు. కీలకమైన కార్గో నిర్వహణ ప్రాంతాల్లో భద్రతా చర్యలపై సిబ్బందితో మాట్లాడారు. శుక్రవారం ఉదయం దువ్వాడ రైల్వే స్టేషన్‌లో పర్యటించి ప్రయాణికుల నిరీక్షణ గదులు, రైల్వే కార్యాలయాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, వాటర్ అవుట్ లెట్, ... మిగతా 6వ పేజీలో

ఇంటి సర్వే

- తక్కువ పన్ను చెల్లిస్తున్న వారిని గుర్తించే ప్రయత్నం
- వైసీపీ హయాంలో జరిగిన తప్పులు సవరించాలని నిర్ణయం
- అక్రమ నిర్మాణాలకు 25 నుంచి 100 శాతం అదనంగా పన్ను విధింపు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ఇళ్ల కొలతల తీసే కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. పెద్ద పెద్ద ఇళ్లు నిర్మించుకొని తక్కువ పన్నులు కడుతున్న వారిని గుర్తించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన నాయకులు, కేడర్ ఆస్తిపన్నుల విషయంలో అనేక జిమ్మిక్కులు చేశారు. దీనిపై అనేక విమర్శలు వచ్చినా స్పందించలేదు. ఇప్పటికే ఆ తక్కువ పన్నులే కొనసాగుతున్నాయి. అదేవిధంగా మరికొందరు టౌన్ ప్లానింగ్ సిబ్బందిని లోబరుచుకొని ఇంటి పన్ను తక్కువ వచ్చేలా మేనేజ్ చేసుకున్నారు. దీనివల్ల ఆశించిన మేర ఆదాయం రావడం లేదని ప్రభుత్వం గుర్తించింది. జూన్ 15వ తేదీలోపు సర్వే పూర్తిచేసి ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన వాటిపై అతిక్రమణను బట్టి జరిమానాలు వేయాలని సూచించింది.

- ఇంటిని ప్లాన్ ప్రకారం కట్టకుండా 10 శాతం ఉల్లంఘన జరిగితే 25 శాతం అదనంగా ఆస్తిపన్ను వేస్తారు.
- ప్లాన్‌ని ఉల్లంఘించి 10శాతం కంటే ఎక్కువ నిర్మాణం జరిగితే 50 శాతం పన్ను పెంచుతారు.
- ప్లాన్ లేకుండా నిర్మాణం చేపట్టినా, ప్లాన్ లేకుండా అదనపు ... మిగతా 6వ పేజీలో

నిరుపయోగంగా కాలనీ ఇళ్లు

- 25 ఏళ్ల క్రితం సంగివలస, వలందపేట మధ్య నిర్మాణం
- 150 గృహాల్లో 50 మాత్రమే వినియోగం
- నిర్మాణ దశలో మరికొన్ని


రెండో వార్డులో సగం నిర్మాణాలతో నిరుపయోగంగా ఉన్న కాలనీ ఇళ్లు

తగరపువలస, మే 23 (ఆంధ్రజ్యోతి) : భీమిలి జోనల్ కార్యాలయం పరిధిలోని రెండవ వార్డులో అనేక కాలనీ ఇళ్లు నిరుపయోగంగా ఉన్నాయి. కొన్నింటి నిర్మాణాలు పూర్తయినా వాటిల్లో ఎవరూ నివశించకపోవడం, మరి కొన్నింటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉండడంతో ఆక్రమణలకు గురవుతున్నాయి. 25 ఏళ్ల క్రితం సంగివలస, వలందపేట మధ్య 150 గృహాలతో కాలనీ నిర్మించారు. గతంలో భీమిలి మునిసిపాలిటీగా ఉన్న సమయంలో ముందుగా ఇళ్లు నిర్మించి తర్వాత లబ్ధిదారులకు కేటాయించారు. ఆ సమయంలో ఇక్కడ కాలనీ ఇళ్లు నిర్మించారు. వీటిలో కొన్ని నిర్మాణాలు పూర్తి కాగా మరికొన్ని నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇళ్లు వచ్చిన లబ్ధిదారుల్లో కొంతమంది అప్పట్లోనే వాటిని ఇతరులకు అమ్ముకున్నారు. ప్రస్తుతం అక్కడ అధికారులు లబ్ధిదారులుగా ఎంపిక చేసిన వారు ఎవరూ లేరు. చాలామంది బినామీలే ఉంటున్నారు. నాడు మంజూరు చేసిన గృహాల్లో 50 మాత్రమే ఇప్పుడు వినియోగంలో ఉండగా మిగిలినవి వివిధ దశల్లో ఉండిపోయాయి. ఇక్కడకి సమీపంలో నమ్మివానిపేటలో బిళ్లలమెట్ట ప్రాంతంలో కూడా కాలనీ ఇళ్లు చాలా వరకూ అసంపూర్తిగా ఉన్నాయి. ఈ కాలనీని అప్పటి ఎమ్మెల్యే కర్రి సీతారామ్ హయాంలో నిర్మించారు. లబ్ధిదారుల ఎంపిక పట్ల అనేక విమర్శలు వచ్చాయి. రెండు సార్లు అధికారులు పరిశీలనలు చేశారు. ఇతర ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులను ఎంపిక చేయడం వల్ల ఆ తర్వాత చాలా గృహాలు అమ్మకాలు జరిగిపోయాయి. కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. ఈ కాలనీ జాతీయ రహదారికి సమీపంలో ఉండడం, భూముల విలువ విపరీతంగా పెరిగిపోవడంతో చాలామంది కబ్జాదారులు ఈ కాలనీ ఇళ్లపై కన్ను వేశారు. కొంతమంది వీటిని ఇతరులకు అమ్మకానికి ప్రయత్నిస్తున్నారు. వాస్తవమైన లబ్ధిదారులు ఎవరూ లేకపోవడంతో అసంపూర్తిగా వివిధ దశల్లో ఉండిపోయిన ఈ గృహాలను ఈ ప్రాంతంలో నిరుపేదలుగా ఉన్న వారికి కేటాయించాలని పలువురు కోరుతున్నారు. కాగా కాలనీ ఇళ్లు మంజూరు చేసిన తర్వాత నిర్మాణాలు పూర్తి చేయకపోతే వాటిని రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంది. కాలనీలో నిర్మాణాలు పూర్తి కాకుండా వివిధ దశల్లో ఉన్న గృహాలను రద్దు చేసి కొత్తగా ఎటువంటి ఆధారం లేని నిరుపేదలకు కేటాయించాలని వామపక్షాల నాయకులు కోరుతున్నారు.

బదిలీల్లో న్యాయం చేయండి

ఏజెన్సీకి బదిలీ అయిన మైదాన ప్రాంత ఉపాధ్యాయుల విజ్ఞప్తి

భీమునిపట్నం (రూరల్), మే 23 (ఆంధ్రజ్యోతి) : మైదాన ప్రాంతాల్లో పని చేస్తూ ఎనిమిదేళ్ల సర్వీసు నిండి తప్పనిసరిగా ఏజెన్సీకి బదిలీ అయిన ఉపాధ్యాయులు ప్రస్తుతం చేపడుతున్న బదిలీల్లో తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మూడేళ్ల క్రితం జరిగిన బదిలీల్లో జిల్లావ్యాప్తంగా 350 మంది ఎస్‌జీలను మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి బదిలీ చేశారు.ఏజెన్సీ నుంచి ఏజెన్సీకి మాత్రమే బదిలీ చేయాలన్న నిబంధన ఉన్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక పోస్టులు రద్దు కావడంతో చాలామంది ఉమ్మడి విశాఖలోని ఏజెన్సీలో ఉన్న 11 మండలాలకు తప్పనిసరిగా బదిలీ అయ్యారు.వారిలో ఎక్కువ మంది 50 ఏళ్లు పైబడిన ఉండగా, 200 మంది మహిళలు ఉన్నారు. రెండేళ్ల సర్వీసు పూర్తి చేస్తే బదిలీల్లో మైదాన మండలాలకు బదిలీ కావచ్చునని వారు ఎంతో ఆశపడ్డారు. కానీ ప్రస్తుతం జరుగుతున్న బదిలీల కౌన్సెలింగ్‌లో వారికి ప్రాధాన్యత పాయింట్లు లేకపోవడంతో బదిలీ అయ్యే అవకాశాన్ని కోల్పోయారు. ఏజెన్సీలో ఏ మారుమూల పాఠశాల అయినప్పటికీ దాన్ని కేటగిరీ 3గానే గుర్తించారు. కేటగిరీ 3లో పనిచేస్తున్న వారికి ఏడాదికి మూడు మార్కులు మాత్రమే వస్తాయి. 2023లో బదిలీ అయిన ఈ ఉపాధ్యాయులందరికీ కేవలం 9 మార్కులు మాత్రమే వస్తాయి. దీంతో వారికి బదిలీ అయ్యే అవకాశం కల్పించడం లేదు.

ఇతర ఉద్యోగులకు ఒకలా..

ఉపాధ్యాయులకు మరోలా..

ఏజెన్సీలో ఎన్‌జీఓలు రెండేళ్ల కంటే అదనంగా పనిచేస్తే వారికి వచ్చే మార్కుల కన్నా అదనంగా 8 మార్కులు ఇస్తూ ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న ఉద్యోగులకు వారికి లభించే స్టేషన్ పాయింట్లతో పాటు ఏడాదికి 5 పాయింట్లు అదనంగా ఇస్తున్నారు. జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న వారికి స్టేషన్ పాయింట్లతో పాటు అదనంగా ఏడాదికి 8 మార్కులు ఇస్తున్నారు. వారంతా ఏజెన్సీలో ఉన్న మండల కేంద్రాల్లో పనిచేస్తుంటారు. వారికి అదనపు పాయింట్ల సదుపాయం ఉండగా మారుమూల కొండల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రం ఈ అవకాశం కల్పించలేదు. ఈవిషయమై పాలకులు, ఉన్నతాధికారులు స్పందించాలని ఏజెన్సీలో పని చేస్తున్న మైదాన ప్రాంత ఉపాధ్యాయులు కోరుతున్నారు.


స్వామివారికి వింజామర సేవ చేస్తున్న దాసుడు

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, మే 23 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఒడిశాకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకోదాసుడు తన బృందంతో కలిసి శుక్రవారం నిత్య కల్యాణం జరిపించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి తొలుత ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి కల్యాణ మండపంలో రజిత వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం దాసుడు, అతని బృందం సభ్యుల గోత్రనామాలతో పాటు, లోక కల్యాణార్థం అన్న సంకల్పంతో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. తరువాత పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు.

కత్తితో దాడి కేసులో ముగ్గురి అరెస్టు

ఆనందపురం, మే 23 (ఆంధ్రజ్యోతి) : కత్తితో దాడి చేసి ఒకరిని తీవ్రంగా గాయపరిచిన కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ చింతా వాసునాయుడు శుక్రవారం తెలిపారు. ఇంటి స్థలం కోసం ఇరు కుటుంబాల మధ్య బుధవారం జరిగిన వివాదంలో ఇంటి కార్తీక్, ఇంటి లక్ష్మణరావు, మణికంఠ కత్తితో బోర సూరిబాబుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి, పరారయ్యారు. సూరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రెండు బృందాలుగా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. శుక్రవారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ చెప్పారు.

శ్రీవారి సన్నిధిలో విష్ణు పారాయణాలు

సాగర్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న మహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆల యంలో శుక్రవారం సామూహిక విష్ణు పారాయణాలు నిర్వహించారు. తొలుత హనుమాన్ చాలీసా పారాయణం చేసిన అనంతరం భక్తులు విష్ణు పారాయణం పఠించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో వ్యాపారుల అదనపు వసూళ్లు

సాగర్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక ప్రాంతాల్లో వ్యాపారులు సందర్శకుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. సాగర్ నగర్ బీచ్, గుడ్లవానిపాలెం ముత్యాలమ్మ, భూలోకమ్మ అమ్మవార్ల ఆలయం వ్యూ పాయింట్ వద్ద, రుషికొండ బీచ్ తదితర చోట్ల వ్యాపారులు పర్యాటకులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. ప్రతి వస్తువుపైనా ఎమ్మార్పీ ధర కంటే రూ. 5 అదనంగా వసూలు చేస్తున్నారు. రుషికొండ బీచ్‌లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంది. ప్రతి వ్యాపారి ధరల పట్టిక ఏర్పాటు చేయడంతో పాటు అధిక వసూళ్లకు పాల్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.

నేడు, రేపు సేంద్రియ మామిడి పండ్ల మేళా

విశాలాక్షినగర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : విశాలాక్షినగర్‌లో ఉన్న బీవీకే కళాశాలలో శని, ఆదివారం సేంద్రీయ మామిడి పండ్ల మేళా నిర్వహించనున్నట్టు గోఆధారిత ప్రకృతి ఆధారిత రైతుల సంఘం జిల్లా కార్యదర్శి అశోక్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మేళాలో అరుదైన మామిడి రకాలు అందుబాటులో ఉంటాయని, రసాయనాలు లేకుండా సేంద్రీయంగా పండించినవని చెప్పారు. రెండు రోజులు ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మకాలు కొనసాగుతాయన్నారు.

'రేషన్ డిపోల వద్ద ప్రధాని ఫొటో ఉంచాలి'

పద్మనాభం రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 1వ తేదీ నుంచి రేషన్ డిపోలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అక్కడ ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి, సంబంధిత శాఖా మంత్రితో పాటు ప్రధాని మోదీ ఫొటో కూడా ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు కోరారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారులు ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఆనందపురం, మే 23 (ఆంధ్రజ్యోతి) : క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని ఆనందపురం సీఐ చింతా వాసునాయుడు అన్నారు. ఆనందపురంలో ఉన్న నిశ్విత బాక్స్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల విజేతలకు శుక్రవారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేసి క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కాగా ఈ పోటీల్లో 45 జట్లు పాల్గొనగా విజయనగరం జట్టు విజేతగాను, ఎల్వీపాలెం జట్టు రన్నర్‌గాను నిలిచాయి. ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జి వెంకటరావు, కొట్యాడ రెడ్డిబాబు, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


విజేతకు బహుమతి అందిస్తున్న సీఐ వాసునాయుడు


బాండ్ అందిస్తున్న పర్యవేక్షణాధికారి రాజు

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, మే 23 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి శ్రీకాకుళం జిల్లా గార మండలం వాడపాలెం గ్రామానికి చెందిన పి. గోవిందరావు, జ్యోతి దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో ఆలయ ప్రజా సంబంధాల పర్యవేక్షణాధికారి సీవీవీ పద్మనాభరాజుకు శుక్రవారం వారు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

మహానాడు ప్రచార రథం ప్రారంభం

కొమ్మాది,మే 23 (ఆంధ్రజ్యోతి) : కడపలో ఈనెల 27వ తేదీ నుంచి జరిగే మహానాడు ప్రచార రథాన్ని మధురవాడ ప్రాంతానికి చెందిన జీఎల్ఎన్ చౌదరి వినూత్న రీతిలో రూపొందించారు. 34 ఏళ్లుగా ఆయన తన సొంత ఖర్చులతో ప్రచార రథాన్ని తయారు చేయడంతో పాటు దాని మీదనే మహానాడు సభలకు హాజరవుతుంటారు. ప్రచార రథాన్ని శుక్రవారం 5వ వార్డు టీడీపీ నాయకుడు మొల్లి లక్ష్మణరావు ప్రారంభించారు. వార్డులోని పార్టీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మద్యంపై జగన్ కట్టు కథలు'

భీమునిపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి) : మద్యం అమ్మకాల్లో జరిగిన అవినీతిపై మాజీ ముఖ్యమంత్రి జగన్ కట్టు కథలు చెబుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విమర్శించారు. శుక్రవారం ఆయన ఇక్కడి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రజలను మోసం చేయడంలో పీహెచ్‌డీ చేశారని,ఐదేళ్ల అధికారంలో ఒక్క రోజు కూడా మీడియా ముందుకు రాని ఆయన ఇపుడు రాష్ట్రంలో ఏదో జరిగిపోయినట్టు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. నాసిరకం మద్యం అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన విషయాన్ని మర్చిపోతే ఎలా అని ప్రశ్నించారు.

అనంతుని ఆలయంలో ఏకాదశి పూజలు



పద్మనాభం, మే 23 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని గిరిపై వెలసిన అనంత పద్మనాభుడి ఆలయంలో ఏకాదశి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అర్చకుడు పవన్ స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు చేశారు. ఎంపీపీ రాంబాబు, తులసి లక్ష్మి దంపతులు, సర్పంచ్ పాప, పద్దు దంపతులు స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు.

సర్వేలను సత్వరమే పూర్తి చేయాలి : ఎంపీడీఓ


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయకుమార్

పద్మనాభం, మే 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వేలను సత్వరమే పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎం. విజయకుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన బీఆర్ తాళ్లవలస సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రకాల సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులను కూడా సకాలంలో పరిష్కరించాలని చెప్పారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఆనందపురం, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శొంఠ్యాం సమీపంలో ఉన్న ఎన్ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ యోగా డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంభు ప్రసాద్ మాట్లాడుతూ యోగా ప్రతిఒక్కరి జీవితంలో దినచర్యగా మారాలన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడి నుంచి దూరం కావడానికి యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు.

టూ టౌన్ పీఎస్‌ను తనిఖీ చేసిన సీపీ

మహారాణిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను సీపీ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత సిబ్బంది విధులను సమీక్షించారు. అనంతరం స్టేషన్ పరిధిలోని సమస్యలను, కేసుల రికార్డులను పరిశీలించారు. సక్రమంగా లేని రికార్డులను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. కాగా విదేశీయులు రూమ్స్ బుక్ చేసుకునే సమాచారం నమోదులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సీపీ సిబ్బందికి అవగాహన కల్పించారు. శుక్రవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో హోటళ్లు, గెస్టుహౌస్, ప్రైవేట్ హౌస్ వసతుల యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విదేశీయుల బస సమాచారం నమోదు, ఫామ్ సి వివరాల నమోదు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఫామ్ సి విదేశీయుడి పూర్తిపేరు, పాస్ పోర్టు నెంబరు, వీసా, దేశం పేరు కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.


తునివలస గ్రామంలోని జగనన్న కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్న దృశ్యం

జగనన్న కాలనీల్లో అధ్వానంగా రహదారులు

పద్మనాభం రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తునివలస, కురపల్లి గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. తునివలస జగనన్న కాలనీలో తునివలస, నరసాపురం గ్రామాలకు చెందిన 168 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. అందరూ ఇళ్లు నిర్మించుకున్నారు. కాలనీలో ఇతర సౌకర్యాల మాట ఎలా ఉన్నా..ఇంతవరకు రోడ్లు పూర్తిస్థాయిలో నిర్మించలేదు. కురపల్లిలో లేఅవుట్ వేసినప్పుడు గ్రావెల్ రోడ్లు వేసినా వెంటనే పాడయ్యాయి. గోతులు ఏర్పడడంతో వర్షం పడితే నీరు చేరి బురదమయంగా మారుతున్నాయి. అధికారులు ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలం

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

సింహాచలం, మే 23 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం పాలనలో అన్నింటా విఫలమైందని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన కుటుంబ సమేతంగా వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సక్రమంగా అమలు చేయలేకపోతుందన్నారు. రాష్ట్రంలో మనీ సర్క్యులేషన్ పూర్తి స్తంభించిందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రజా సమస్యల కంటే పాలకులకు అమరావతి అభివృద్ధే ముఖ్యమైందని విమర్శించారు. అప్పన్నస్వామి చందనోత్సవం నాడు ఏడు మంది ప్రాణాలు కోల్పోవడం చాలా బాధ కలిగించిందన్నారు. ఈ సంఘటనకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. తొలుత మాజీ మంత్రి సత్యనారాయణకు దేవాలయ ఏఈఓ పిళ్లా శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా స్వాగతించారు. దర్శనం అనంతరం వేదాశీర్వచనాలు, ప్రసాదాలను ఇచ్చారు.

డీఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

(5వ పేజీ తరువాయి)

ప్లాట్‌ఫామ్‌లపై పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. అనంతరం అమృత్ భారత్ పథకంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. స్టేషన్‌కు ఇరువైపులా ఉన్న సర్క్యులేటింగ్ ఏరియాను పరిశీలించి నిర్ణీత సమయానికి పనులు పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. దువ్వాడ స్టేషన్ వద్ద కలిసిన జెడ్‌ఆర్‌యూసీసీ మెంబరు కె.ఈశ్వరరావు, వివిధ ఎన్జీవోల సంఘాల ప్రతినిధులు పలు సమస్యలు ప్రస్తావించగా...పరిష్కారానికి కృషి చేస్తామని డీఆర్ఎం హామీ ఇచ్చారు.

బెంగళూరు, షాలిమార్‌కు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

విశాఖపట్నం,మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ-బెంగళూరు, విశాఖ-షాలిమార్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నామని సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. విశాఖ - బెంగళూరు రైళ్లు జూన్ 1 నుంచి 30 వరకు, విశాఖ-షాలిమార్ రైళ్లు జూన్ 3 నుంచి 25 వరకు అందుబాటులో ఉంటాయన్నారు.

విశాఖ-బెంగళూరు-విశాఖ: 08581 నంబరు గల రైలు జూన్ 1 నుంచి 29 వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.50 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.45 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08582 నంబరుతో జూన్ 2 నుంచి 30 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 3.50 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు దువ్వాడ, విజయవాడ, రేణిగుంట, జోలార్‌పేట మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

విశాఖ-షాలిమార్-విశాఖ: 08508 నంబరు గల రైలు జూన్ 3 నుంచి 24 వరకు ప్రతి మంగళవారం ఉదయం 11.20 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు వేకువజాము 3 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08509 నంబరు గల రైలు జూన్ 4 నుంచి 25 వరకు ప్రతి బుధవారం ఉదయం 5 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి అదే రోజు రాత్రి 8.50 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు సింహాచలం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, ఖుర్దారోడ్డు, భువనేశ్వర్, కటక్, జైపూర్, కేంఝుహార్‌రోడ్డు, ఖరగ్‌పూర్, సంత్రాగచ్చి మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

(5వ పేజీ తరువాయి)

శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ 1995లో పెందుర్తి జడ్పీటీసీ సభ్యునిగా పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించింది నందమూరి తారకరామారావేనన్నారు. 2019-24 మధ్య దుర్మార్గుడి చేతిలో రాష్ట్రం నాశనం కావడంతో ప్రజలు గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ఏకపక్షంగా తీర్పు చెప్పారన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన పేదల పార్టీ కావడంతో తెలుగుదేశం ఉమ్మడి ఏపీలోనూ, ప్రస్తుతం నవ్యాంధ్రలోను మనుగడ సాగించగలుగుతుందన్నారు. దూరదృష్టితో పాలిస్తున్న చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలో 70 ఏళ్లు దాటిపోతున్న వారిని గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు. సీనియర్ నాయకులకు జిల్లా కమిటీలలో స్థానం కల్పించాలని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే పార్టీ ధ్యేయమన్నారు. మినీ మహానాడుకు అధ్యక్షత వహించిన విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ మాట్లాడుతూ విశాఖపట్నానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేస్తున్నారని అన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. మినీ మహానాడులో చేసిన తీర్మానాలను మహానాడుకు పంపిస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ఉత్తర నియోజకవర్గానికి వెంటనే ఇన్‌చార్జిని నియమించాలని కోరారు. ఇన్‌చార్జి లేకపోవడంతో నాయకులు, కార్యకర్తల ఇబ్బందులు పట్టించుకునేవారు లేరన్నారు. సమావేశంలో విశాఖ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, పార్టీ నాయకులు చోడే వెంకట పట్టాభి, కోరాడ రాజబాబు, అక్కరమాని విజయనిర్మల, వెల్లంకి భరత్, గొంప కృష్ణ, లొడగల కృష్ణ, తెలుగు మహిళ, యువత, బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు సర్వసిద్ధి అనంతలక్ష్మి, తాతాజీ, విజయకుమార్, బుడుమూరు గోవిందరావు, తోటరత్నం, ఈతలపాక సుజాత పాల్గొన్నారు.

ఉక్కులో బిక్కుబిక్కు

(5వ పేజీ తరువాయి)

అవకాశం లేదనే వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం నడుస్తున్న రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లకు తోడు జూన్20 నుంచి మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను కూడాఆపరేషన్‌లోకి తేవాలని యత్నిస్తున్నారు. అయితే ప్లాంటులో అవసరమైనంత సిబ్బంది లేరు. దాదాపు 1,200 మంది ఉద్యోగులను వీఆర్ఎస్‌లో పంపించేశారు. ఓ 300 మంది వరకు రాజీనామాలు చేసి వెళ్లిపోయారు. ఇటీవల కాంట్రాక్టు కార్మికులు 2,500 మందిని తొలగించారు. ఇంకో 1,500 మంది తీసేయడానికి జాబితా సిద్ధం చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ కార్మికులు ఈ నెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. వచ్చే నెలలో మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రారంభించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. ఈ తరుణంలో అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవలసి ఉండగా, ఉన్నవారిని తొలగిస్తే ఉత్పత్తి ఎలా సాధ్యమనేది ఆలోచించడం లేదు.

కొత్త వారికి గేటు పాస్‌లు

మూడు రోజులు విధులకు హాజరుకాకుండా సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికులను తక్షణమే తొలగించాలని యాజమాన్యం కాంట్రాక్టర్లను ఆదేశించింది. వారి స్థానంలో కొత్త వారిని తీసుకోవాలని సూచించింది. వారికి వెంటనే గేటుపాస్‌లు ఇస్తామన్నారు. కొత్తగా పనులకు వచ్చేవారికి ఏ అనుభవం ఉండదని, వారితో ఏమి పనులు చేయించుకుంటామని విభాగాధిపతులు వాపోతున్నారు. ఇంకెన్ని ప్రమాదాలు జరుగుతాయోనన్న ఆందోళన నెలకొంది.

కరోనా టెన్షన్

(5వ పేజీ తరువాయి)

కొత్తగా వచ్చిన వారికి ఇక్కడి పరిస్థితి తెలియడం లేదు. వేరియంట్‌ల వల్ల దేశంలో ఇప్పటివరకూ 257 కేసులు నమోదైనట్టు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న వేరియంట్‌కు సంబంధించిన వైరస్ సోకిన వారిలో దగ్గు, గొంతునొప్పి, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, నీరసం, నిస్సత్తువ, కొందరికి కండ్ల కలక వంటి లక్షణాలు మూడు నుంచి వారం రోజుల పాటు ఉంటున్నట్టు చెబుతున్నారు. లక్షణాలను బట్టి మందులు అందిస్తారు. నగరానికి చెందిన 28 ఏళ్ల మహిళకు కరోనా పాజిటివ్ వచ్చిన విషయం తెలిసిందే.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

కరోనా గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో వారం కంటే ఎక్కువ రోజులు బాధ పడుతుంటే అలసత్వం ప్రదర్శించవద్దు. వైద్యు లను సంప్రతించి పరీక్షలు చేయించుకోవాలి. విమ్స్‌లో ప్రత్యేకంగా ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశాం. పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన ర్యాపిడ్ కిట్స్ కూడా సిద్ధం చేశాం. ప్రస్తుతం కొవిడ్ వైరస్ వేరియంట్ ఎక్కువగా ముంబై, కేరళల్లో వ్యాప్తి చెందుతోంది. గతంలో కూడా మొదట ఆయా ప్రాంతాల్లోనే కేసులు నమోదు కావడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది.

- డాక్టర్ కె. రాంబాబు,
విమ్స్ డైరెక్టర్, కరోనా వైరస్ నోడల్ అధికారి

ఇంటి సర్వే

(5వ పేజీ తరువాయి)

అంతస్థు వేసినా 100 శాతం ఆస్తి పన్ను పెంచుతారు.

- ఎవరైనా ఇంటి ముందు దుకాణం పెట్టుకున్నా, ఆఫీసుకు అద్దెకు ఇచ్చినా దానిని వాణిజ్య భవనంగా పేర్కొంటూ ఆస్తి పన్ను రెండున్నర రెట్లు పెంచుతారు.

సక్రమంగా కడుతున్న వారికి ఇబ్బంది లేదు

ఇంటి విస్తీర్ణం ప్రకారం పన్నులు కడుతున్న వారిపై కొత్తగా పడే భారం ఏమీ ఉండదని అధికారులు చెబుతున్నారు. నిర్మాణాన్ని బట్టి పన్ను, నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి జరిమానాలు విధించేందుకు మాత్రమే సర్వే చేపట్టినట్టు చెబుతున్నారు.

కౌన్సిల్‌లో చర్చించాలి

ఏపీ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం ప్రకారం ఆస్తి పన్ను పెంపు లేదా జరిమానా విధించే అధికారం జీవీఎంసీ కౌన్సిల్‌కే ఉంటుంది. రీసర్వేపై కౌన్సిల్‌లో చర్చించలేదు. వెంటనే సర్వే ఆపాలి.

గంగారావు, కార్పొరేటర్, సీపీఎం ఫ్లోర్ లీడర్

తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం,మే 23 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కు కర్మాగారంలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 1562 రోజు రిలే నిరాహార దీక్షల శిబిరంలో శుక్రవారం సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికులు, ఉక్కు ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటులో తొలగించిన రెండువేల మంది కాంట్రాక్టు కార్మికులను తక్షణమే ఉక్కు యాజమాన్యం విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఉద్యోగ ఉపాధి కల్పించకుంటే భూములిచ్చిన రైతులకు తిరిగి వారి భూములను వారికి ఇచ్చివేయాలన్నారు. పోరాట కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ స్టీలుప్లాంటును ఆదుకున్నామని, రూ.11 వేల కోట్లు ఇచ్చామని, కేంద్ర ప్రభుత్వం చెబుతోందని, కానీ, అందులో రూ.8 వేల కోట్లు బ్యాంకు రుణాల కింద తీసుకున్నారన్నారు. మిగిలిన రూ.3 వేల కోట్లు ఇవ్వాలంటే 5 వేల మంది ఉద్యోగులను తొలగించాలన్న నిబంధన పెట్టడం దుర్మార్గమన్నారు. ఉక్కు కర్మాగారానికి భూములిచ్చిన రైతులు, ఉక్కు నిర్వాసితులకు నేటి వరకూ న్యాయం చేయలేదన్నారు. స్టీల్‌ప్లాంటును నిర్వీర్యం చేసి అదానీకి ఇద్దామని చూస్తున్నా, ఇక్కడి ప్రజలు సహించరన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, యు.రామస్వామి, డీసీహెచ్ వేంకటేశ్వరరావు, లక్కరాజు సోంబాబు, కేఎస్ఎన్ రావు, ఎన్.రామారావు, కేఎం శ్రీనివాస్, దొమ్మేటి అప్పారావు, భాస్కర రావు, అప్పారావు, రమణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

ఉక్కుటౌన్‌షిప్, మే 23 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. విధులకు హాజరయ్యే వారి సంఖ్య రోజురోజుకూ తగ్గుతోంది. దీంతో సమ్మె లో పాల్గొనే కార్మికుల సంఖ్య పెరుగుతోంది. తొలి రోజు (20వ తేదిన) సుమారు 60 శాతం మంది కార్మికులు విధులకు హాజరు కాగా, 21, 22 తేదీల్లో 50 శాతం మంది కార్మికులు విధులకు హాజరయ్యారు. శుక్రవారం మాత్రం సుమారు 40 శాతం మంది కార్మికులు మాత్రమే విధులకు హాజరయ్యారు. కొన్ని ప్రధాన విభాగాల్లో కాంట్రాక్టు కార్మికులు తప్పనిసరి పరిస్థితుల్లో హాజరు కావాల్సి వస్తోంది. కాంట్రాక్టు కార్మికుల తొలగింపుపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకూ నిరవధిక సమ్మె విరమించేది లేదని కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు.

రామ కోటి పుస్తకాలతో భద్రాచలానికి భక్తుల పయనం



వడ్లపూడి ఆంజనేయస్వామి ఆలయంలో రామ కోటినామాల పుస్తకాలతో కార్పొరేటర్ బొండా జగన్, భక్తులు

కూర్మన్నపాలెం, మే 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడి అంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 250 రామ కోటి పుస్తకాలను తీసుకొని భక్తులు భద్రాచలంకు బయలుదేరారు. తొలుత స్వామి వారికి సిందూరం, తమలపాకులతో పూజలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ బొండా జగన్ ఆ పుస్తకాలకు అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదో రూపంలో భగవన్నామస్మరణ చేసినప్పుడు మానసిక ప్రశాంతతం లభిస్తుందన్నారు. రామకోటి రాయడం వల్ల ఏకాగ్రత, పట్టుదల వంటి లక్షణాలు అలవడతాయన్నారు. ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలన్నారు. భద్రాచలం వెళ్తున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాటూరి రాము, తాత నాయుడు, మింది గోవింద్, కర్రి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన గంగవరం పోర్టు కార్పొరేట్ వ్యవహారాల విభాగాధిపతి బాపూజీ



జీవీఎంసీ డిప్యూటీ మేయర్ గోవిందరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాపూజీ

గాజువాక, మే 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవిందరాజును అదానీ గంగవరం పోర్టు కార్పొరేట్ వ్యవహారాల విభాగాధిపతి కేఎస్ఎస్ బాపూజీ శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. డిప్యూటీ మేయర్‌గా ఎన్నిక కావడం ఆనందంగా ఉందని, ప్రజలకు మంచి చేసేందుకు చేపట్టేకార్యక్రమాలకుతమ వంతుఅండగా నిలుస్తామన్నారు.

నేడు రక్తదాన శిబిరం

అగనంపూడి, మే 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సౌజన్యంతో శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రక్తాన్ని సేకరించనున్నట్టు చెప్పారు. ఆరోగ్యవంతులంతా రక్తాన్ని దానం చేసి ప్రాణాపాయ స్థితి ఉన్న క్షతగాత్రులను రక్షించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సినిమా గైడ్

- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం)
- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **నిశ్శబ్దప్రేమ** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం),
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: రమాదేవి, సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 28, క్యాబేజీ 16, క్యారెట్ 38 దొండకాయలు 18, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది) 9, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది) 50, బరబాటి 26, ముల్లంగి 30, బద్దచిక్కుడు 40, నిమ్మకాయలు (కిలో) 80, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, క్యాప్సికమ్ 54, పొట్లకాయ(పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 64, గోరుచిక్కుడు 32, దేముదుచిక్కుడు 64, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర(పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర(కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, బూడిద గుమ్మడికాయ 20, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె అందజేత



పారిశుధ్య కార్మికులకు సామగ్రి అందజేస్తున్న ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్

గాజువాక, మే 23 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అహర్నిశలూ శ్రమించే పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని గాజువాక జోన్ ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 66వ వార్డులో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆయిల్, సబ్బులు, నిత్యావసర వస్తువులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు గోమాడ వాసు, మాజీ కార్పొరేటర్ ఎండీ.రఫీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయాల్లో వసతుల కల్పనకు వినతి

గాజువాక, మే 23 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో గృహ సముదాయాల్లో వసతులు కల్పించాలని కోరుతూ జోనల్ అధికారులకు సీపీఐ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గాజువాక జోనల్ కార్యాలయంలో అధికారులను కలిసి సమస్యలను విన్నవించారు. కొంతమంది టిట్కో గృహాల కోసం నగదు చెల్లించినప్పటికీ ఇంకా గృహాల కేటాయింపులు చేయలేదన్నారు. అలాగే కేటాయింపులు చేసిన వారికి కూడా ఇంకా ఇళ్ల తాళాలు ఇవ్వలేదన్నారు. ఈ సముదాయాల్లో కనీస సౌకర్యాలు లేవని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, అప్పలరాజు, భాస్కరరావు, నాగేశ్వరరావు, రహిమా ఉన్నారు.

అశోక్‌నగర్‌కు తాగునీటి కష్టాలు

10 రోజులుగా సరఫరా బంద్

పెదగంట్యాడ, మే 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్‌లో స్థానికులు తాగునీటికి కటకటలాడుతున్నారు. గత పది రోజులుగా కొళాయిల నుంచి నీరు రావడం లేదు. ఈ కాలనీలో నాలుగువందల కుటుంబాలు నివసిస్తున్నాయి. అందులో 90 శాతం ఇళ్లకు మున్సిపల్ కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. కాలనీ కొండవాలు ప్రాంతంలో ఉండడంతో దిగువ ప్రాంతాల్లో ఉన్న నివాసాలకు రెండు రోజులకోమారు అరగంట పాటు కొళాయిల నుంచి నీరు సరఫరా జరిగేది. ఎగువ ప్రాంతంలో ఉన్న నివాసాలకు కొళాయిలు ఉన్నా వాటి నుంచి నీరు తొలి నుంచి రావడం లేదు. దిగువ ప్రాంతాల్లో ఉన్న నివాసాలకు కూడా పది రోజుల నుంచి కొళాయిల నుంచి నీటి సరఫరా కావడం లేదు. కాలనీలో ఉన్న గొట్టపు బావుల నుంచి కూడా నీరు రావడంలేదు. ప్రత్యామ్నాయంగా వేరే ప్రాంతాల నుంచి తాగునీటిని తెచ్చుకోవలసిన పరిస్థితి వచ్చింది. ఈ విషయమై జీవీఎంసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నిమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోతోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ సమస్య వచ్చినా సమాచారం ఇస్తే చాలు పరిష్కరిస్తామని చెప్పే ప్రజాప్రతినిధులు తీరా సమస్య వచ్చినప్పుడు కనిపించకపోవడం అన్యాయమని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని కొళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

మోదకొండమ్మ పండుగ గోడపత్రిక ఆవిష్కరణ



పండుగ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కమిటీ

గోపాలపట్నం, మే 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరానగర్‌లో కొలువైన శ్రీ మోదకొండమ్మ అమ్మవారి పండుగ జూన్ 17న నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేర ఆలయ ప్రాంగణంలో పండుగ గోడ పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. 15న పుట్టబంగారం తీత, 16న తొలెళ్ల, 17న ప్రధాన పండుగ అని చెప్పారు

ఘనంగా తిరంగా ర్యాలీ

పెందుర్తి, మే 23(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయం సాధించడంతో త్రివిధ దళాలకు మద్దతుగా ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం పెందుర్తిలో తిరంగ ర్యాలీ జరిగింది. సుజాతనగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కూటమి నేతలు, కార్యకర్తలు సంయుక్తంగా చినముషిడివాడ జంక్షన్ వరకు తిరంగా ర్యాలీ చేశారు. ఆపరేషన్ సిందూర్ బ్యానర్‌తో జాతీయ పతాకాలు చేతపట్టుకుని వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ సిందూర్ యుద్ధంలో భారత్ విజయం సాధించి పెహల్గామ్‌లో చనిపోయిన పర్యాటకుల బంధువులకు వీర జవాన్‌లకు నైతిక ధైర్యాన్ని ఇచ్చేందుకు ప్రజాభాగస్వామ్యంతో తిరంగా ర్యాలీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.



ర్యాలీలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, తదితరులు

ఆర్థిక ఇబ్బందులతో కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య



అప్పలరాజు(ఫైల్)

కూర్మన్నపాలెం,మే 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి సమీపంలో దానబోయినపాలేనికి చెందిన ఉక్కు ఉద్యోగి కర్రి కనకారావు, తన బార్య రమణమ్మ పిల్లలు అప్పలరాజు, బిందు నూకరత్నంలతో నివాసముంటున్నాడు. కనకారావు తన ఇరువురు పిల్లలకు వివాహాలు జరిపించాడు. తన కుమారుడు కర్రి అప్పల రాజు (37)కు, అనకాపల్లి జిల్లా మాకవరపాలేనికి చెందిన అరుణతో 2014లో వివాహం జరిపించాడు. అప్పలరాజు, తన భార్య అరుణ, బాబు దినేష్, పాప ప్రత్యూషతో తన తల్లిదండ్రులకు సమీపంలో వేరే ఇంటిలో నివాముంటున్నాడు. ఉక్కు కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్న అప్పలరాజు భార్య అరుణకు తెలియకుండా సుమారు రూ.5 లక్షలు అప్పులు చేశాడు. మద్యానికి అలవాటు, జులాయిగా తిరుగుతూ అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో అప్పులు చేశాడు. ఈ అప్పులు విషయం భార్యకు తెలియడంతో భార్యభర్తల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో అరుణ పిల్లలను తీసుకొని రెండు వారాలు క్రితం మాకవపాలెంలోని పుట్టింటికి వెళ్లిపోయింది. తన పిల్లలు దూరమవడంతో అప్పలరాజు తీవ్ర ఆవేదనకు గురయ్యేవాడు. అప్పలరాజు గురువారం రాత్రి తల్లిదండ్రులు వద్దకు వెళ్లి తన బట్టలను ఆరవేసి, కాసేపు మాట్లాడి తిరిగి తన ఇంటికి వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం ఏ షిఫ్టు విధులకు వెళ్లాల్సిన అప్పలరాజు డ్యూటీకి రాకపోవటంతో ఉక్కు అధికారి.. అప్పలరాజు తండ్రి అయిన ఉక్కు ఉద్యోగి కర్రి కనకారావుకు సమాచారం తెలిపి, అప్పలరాజును జనరల్ షిఫ్టుకు రమ్మని సూచించారు. ఈ విషయాన్ని కనకారావు, తన భార్య రమణమ్మకు ఫోన్ చేసి సమాచారం అందించారు. అప్పలరాజుకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో రమణమ్మ సమీపంలో ఉన్న అప్పలరాజు ఇంటికి వెళ్లి తలుపు కొట్టింది. లోపల గడియ పెట్టి ఉండడంతో ఇరుగు పొరుగు వారి సహాయంతో తలుపులు బద్దలు కొట్టించి చూడగా, అప్పలరాజు బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని మృతి చెంది ఉన్నాడు. దీంతో దువ్వాడ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకొన్న దువ్వాడ పోలీసులు అప్పలరాజు మృతదేహాన్ని పరిశీలించి, ఆత్మహత్య కేసుగా నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. తల్లి కర్రి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



కర్రి అప్పలరాజు మృతదేహం

గొలుసు దొంగ అరెస్టు

- 5.75 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- నిందితుడు శ్రీకాకుళం జిల్లా బైరిపురం వాసి



నిందితుడు రాజేశ్

కూర్మన్నపాలెం, మే 23 (ఆంధ్రజ్యోతి) : పలు చోరీలకు సంబంధించిన కేసుల్లో ఉన్న దొంగను దువ్వాడ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 86వ వార్డు సైమన్ నగర్‌లో నివాసముంటున్న ఓ మహిళ ఈ నెల 21 సాయంత్రం వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి బైకు వచ్చిన యువకుడు ఆమె మెడలో ఉన్న మూడు తులాల పుస్తెల తాడు తెంచుకొని పరారయ్యాడు. బాధిత మహిళ 112కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. సీపీ ఆదేశాలు మేరకు దువ్వాడ క్రైమ్ ఎస్సై విలియమ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా నిందితుడు ఎన్.రాజేశ్‌గా గుర్తించారు. పోలీసులు శుక్రవారం దువ్వాడ రైల్వే స్టేషన్ సమీపంలోని మంగలపాలెం వద్ద మాటువేసి నిందితుడు రాజేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. నిందితుడిపై 7 క్రిమినల్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. నిందితుడి నుండి చోరీకి గురైన 3 తులాలు బంగారు గొలుసు, గాజువాక కేసుకు సంబందించి 2.75 తులాలు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయి శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం భైరిపురం గ్రామానికి వ్యక్తి అని పోలీసులు తెలిపారు. మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు

అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణ

పెందుర్తి, మే 23(ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా పరిధి నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణతో నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణ ప్రవేశం కోసం అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ఆపై చదివి, 18 నుంచి 44 మధ్య వయసు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు పెదగంట్యాడలో నేక్ శిక్షణ కేంద్రంలో ఉచితంగా శిక్షణ ఇస్తామని, అనంతరం ధ్రువీకరణ పత్రం ఇస్తామని, సంబంధిత రంగంలో నేక్ ఆధ్వర్యంలో ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 9490391324 నంబర్‌కు సంప్రదించాలని ఏడీ రవికుమార్ తెలిపారు.

గోవుల తరలింపును అడ్డుకున్న పోలీసులు



పెందుర్తిలో పట్టుబడ్డ గోవులతో ఉన్న కంటైనర్

పెందుర్తి, మే 23 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కంటైనర్లలో తరలిస్తున్న గోవులను పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా నుంచి కంటైనర్ (గూడ్స్ లారీ)లో పెందుర్తి మీదుగా గోవులను తరలిస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందింది.దీంతో సీఐ కెవీ సతీశ్‌కుమార్, పోలీసులు పినగాడి హైవే రోడ్డు వద్ద మాటు వేశారు. ఈ క్రమంలో ఎన్‌హెచ్-16లో ఆనందపురం నుంచి పెందుర్తి వైపు వస్తున్న వాహనాల ముమ్మర తనిఖీ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఓ కంటెయినర్‌ను గమనించిన పోలీసులు తనిఖీలు చేపట్టగా 47 గోవులు ఉన్నట్లు గుర్తించారు. గోవులను కుక్కి తాళ్లతో కట్టేయడంతో ఊపిరాడక అల్లాడుతున్నాయి. లారీకి సంబంధించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. కంటైనర్ తమిళనాడు వెళుతున్నట్లు తెలిసిందన్నారు. పార్వతీపురం సంతలో తక్కువ ధరకు గోవులను కొనుగోలు చేసి తరలిస్తున్నారని పేర్కొన్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నామని సీఐ తెలిపారు.

మహిళ మృతికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌కు శిక్ష

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి) : బస్సును అజాగ్రత్తగా నడిపి మహిళ మృతికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌కు ఏడాది కఠిన కారాగార శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధిస్తూ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ఇందుకు సంబంధించి అదనపు పబ్లిక్ సీనియర్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్జి ప్రకాష్ ప్రకాష్ 2023, సెప్టెంబరు 29న వన్‌టౌన్ పరిధిలో చిలకపేట బస్టాప్ వద్ద ఓ మహిళను బస్సుతో ఢీకొని ఆమె మృతికి కారణమయ్యాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి సాక్షాలు కోర్టులో హాజరు పరిచారు. కోర్టులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.



దువ్వాడ రైల్వే స్టేషన్లో డీఆర్ఎం లలిత్ బొహ్రాను సత్కరిస్తున్న దువ్వాడ రైల్వే యూజర్సు అసోసియేషన్ సభ్యులు

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో డీఆర్ఎం తనిఖీలు

కూర్మన్నపాలెం, మే 23 (ఆంధ్రజ్యోతి) : దువ్వాడ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం వాల్తేరు డివిజన్ రైల్వే జనరల్ మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బొహ్రా, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఆకస్మికంగా పర్యటించారు. అమృత్ భారత్ పథకం క్రింద జరుగుతున్న పునరాభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ప్రధాన రైల్వే స్టేషన్ నిర్మాణాన్ని పరిశీలించి ప్లాట్‌ఫారమ్-1 వద్ద భవన నిర్మాణం, 12 అడుగులు వెడల్పు గల పై ఓవర్ బ్రిడ్జి పనులు, సుందరీకరణ, ప్లాట్‌ఫారమ్-4 వైపు ఉన్న రోడ్డు విస్తరణ పనులు పరిశీలించి, ప్లాట్‌ఫారమ్‌పై ఉన్న దుకాణాదారులతో ముచ్చటించారు. సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జడ్ఆర్‌యూసీసీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే యూజర్సు అసోసియేషన్ అధ్యక్షుడు జాషువా డీఆర్ఎం ,సీనియర్ డీసీఎంలకు ఘనంగా సత్కరించారు. అనంతరం వందే భారత్ రైలులో స్లీపర్ క్లాస్ కోచ్‌లను ఏర్పాటు చేయాలని, విశాఖ నుంచి కొల్లాం, వారణాశి, షిర్డీ, గాంధీగ్రామ్, చెన్నైలకు వెళ్లే వారాంతపు ప్రత్యేక రైళ్లను ప్రతిరోజూ నడపాలనీ, ప్రస్తుతం విశాఖ-తిరుపతి మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌లో కేవలం 11 కోచ్‌లు మాత్రమే ఉండటం వల్ల థర్డ్, సెకెండ్ ఏసీ కోచ్‌లను ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.ఈ పర్యటనలో సీనియర్ డీఈ సాయినువాబ్ నాథ్, ఐవోడబ్ల్యూ శ్రీనివాస్, రవి కిరణ్, ఎలక్ట్రికల్ సిబ్బంది డీవీ రమణ, ఎంఎస్‌పి రావు, ఆర్పీఎఫ్ సీఐ రమణ తదితరులు పాల్గొన్నారు.

వారాహిమాత ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్.

అగనంపూడి, మే 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి గల్లవానిపాలెం వారాహిమాత ఆలయం నిర్మాణానికి దాతలు గల్లా రమణ, గల్లా ఈశ్వరరావులు ముందుకొచ్చారు. ఈ ఆలయ నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గ్రామంలో వారాహిమాత ఆలయం నిర్మాణం చేపట్టడానికి దాతలతో పాటు గ్రామస్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కరణం జగదీశ్, మహిళా అధ్యక్షురాలు గల్లా హనిత, స్థానిక నాయకులు రుద్రకుమార్, గల్లా సూర్యనారాయణ, మాడిశ వెంకటరమణ, సింగిడి సింహాచలం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్, ఐఓసీలలో చెత్త తొలగింపునకు శ్రీకారం



అధికారులతో మాట్లాడుతున్న సీఎంహెచ్‌వో సునీల్‌కుమార్

మల్కాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) కంపెనీల శివారు భారీగా పేరుకుపోయిన చెత్తను సోమవారం నుంచి తొలగించే కార్యక్రమానికి జీవీఎంసీ శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో శుక్రవారం జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ సునీల్‌కుమార్, జోన్ 5 అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ సునీల్ కుమార్, జీవీఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ సంపత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసన్న, అసిస్టెంట్ ఇంజనీర్ సంతోశ్, హెచ్‌పీసీఎల్, ఐఓసీ అధికారులు కంపెనీల శివారు ప్రాంతాన్ని పర్యటించారు. కొన్ని రోజులుగా ఆ చెత్త కంపు కొట్టడంతో ఆ కంపెనీలలో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని జీవీఎంసీ దృష్టికి వెళ్లింది. దీంతో సోమవారం నుంచి చెత్త తొలగింపు కార్యక్రమానికి జీవీఎంసీ శ్రీకారం చుట్టింది.

స్టీల్‌ప్లాంట్ కార్మికుల తొలగింపు ఆపాలి

కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డిమాండ్



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు దగ్గర నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు

మల్కాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల తొలగింపులను ఆపాలని కోరుతు, హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు దగ్గర సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ శుక్రవారం ధర్నా కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా సీఐటీయూ మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికులపై పోలీస్ బలగాలను ప్రయోగించి సమ్మెను విచ్చిన్నం చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఇప్పటికే మూడువేల మందిని తొలగించారిని, మరో 2400 మందిని తొలగించాలనే ఆలోచనలో ఉన్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తొలగింపు చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు.

చిట్టీల నిర్వాహకులు పరారీ

రూ.కోటి యాభై నాలుగు లక్షలకు టోకరా

గాజువాక, మే 23 (ఆంధ్రజ్యోతి) : శ్రీనగర్ అఫిషియల్ కాలనీలో చీటీలు నిర్వహించి ఖాతాదారులకు కోటి యాభై నాలుగు లక్షల రూపాయలు టోకరా వేసి పరారైన ఓ మహిళపై గాజువాక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. శ్రీనగర్ అఫిషియల్ కాలనీలో ఎం.చిట్టమ్మ అనే మహిళ స్థానికంగా నమ్మకంటీ ఉంటూ నెలవారీ, రోజు వారి, పండుగ చీటీలు నిర్వహించేది. చీటీలు పాడుకున్న వారికి నగదు ఇవ్వకుండా కాలయాపన చేసింది. నగదు చెల్లించమని అడిగితే సరిగా సమాధానం చెప్పేదికాదని బాధితులు పోలీసులకు తెలిపారు. అయితే రెండు నెలల నుంచి చిట్టిమ్మతో పాటు ఆమె కుటుంబ సభ్యులు కూడా ఇంటి వద్ద కనిపించడం లేదని, ఇంటికి తాళం వేసి ఉందని పలువురు తెలిపారు. తమకు న్యాయం చేయాలని గాజువాక పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఐగా ఎన్.వి.ప్రభాకరరావు బాధ్యతల స్వీకరణ

గోపాలపట్నం, మే 23(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ శాంతి భద్రతల విభాగం సీఐగా ఎన్.వీ.ప్రభాకరరావు బాధ్యతలు స్వీకరించారు. ఇంతకముందు స్పెషల్ బ్రాంచ్ సీఐగా విధులు నిర్వహించి ఇప్పుడు ఈ ప్రాంతానికి సీఐగా బదిలీపై వచ్చారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలపై దృష్టి పెట్టాలని అన్నారు.

ఇదేమి చోద్యం!

40 అంతస్థుల భవనానికి ప్రజలు ప్రయాణించే రోడ్డే పార్కింగా...



సీతమ్మధార రైతుబజార్ పక్క రోడ్డులో వాహనాల పార్కింగ్

సీతమ్మధార, మే 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏ చిన్న అపార్టుమెంట్, గ్రూప్ హౌస్ కట్టినా తప్పనిసరిగా ఆయా గృహాల్లో నివసించేవారి వాహనాలకు పార్కింగ్ స్థలం కేటాయించాలన్నది జీవీఎంసీ నిబంధన. నగరం నడిబొడ్డున ఎత్తయిన భవనంగా సీతమ్మధారలో గల ఆక్సిజన్ టవర్స్ గుర్తింపు పొందాయి. సుమారు 40 అంతస్తులు గల ఈ భవనానికి పార్కింగ్ సదుపాయం లేక పోవడం విడ్డూరం. ఆ భవనంలో ఉంటున్నవారు ప్రజలు ఉపయోగిస్తున్న రోడ్డునే తమ పార్కింగ్ ప్రాంతంగా మార్చేసుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఆ రహదారిలో ఉదయం నుంచి రాత్రి వరకు ఆ భవనానికి చెందిన వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఆ రహదారి గుండా కేఆర్ఎం కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, మద్దిలపాలెం, నక్కవానిపాలెం, చైతన్యనగర్ తదితర ప్రాంతాల ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. సీతమ్మధార రైతుబజార్‌కి నిత్యం కొన్ని వందల మంది వస్తూ పోతుంటారు. రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేసి ఉంచడంతో అటుగా ప్రయాణించేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ఆ రహదారి గుండా వెళ్లడమే కష్టతరంగా మారుతోంది. శని, ఆదివారాల్లో రైతుబజార్‌కి వచ్చేవారి సంఖ్య అధికంగా ఉంటుంది. అప్పుడు అటుగా ప్రయాణించే వారు బాబోయ్.. ఇదేమి చోద్యం.. ఆక్సిజన్ టవర్స్ భవనానికి లోపల పార్కింగ్ లేదా? అంటూ విస్తుపోతున్నారు.

ఏకంగా బోర్డు పెట్టేసి...

ఈ రోడ్డు తమ సొంతం అన్నట్లు ఏకంగా భవనం గోడలపై ఆక్సిజన్ టవర్స్ పార్కింగ్ అని పెద్ద పెద్ద అక్షరాలతో రాయించారు. అలా ఆ భవనం మొదలుకొని చివర వరకు వారి సొంత జాగీరులా అయిదు, ఆరు చోట్ల బోర్డులు ఏర్పాటు చేశారు. అటుగా వెళ్లిన వారు అయ్యో! ఈ రోడ్డు ఆక్సిజన్ టవర్స్ వారికి రాసి ఇచ్చినట్లు ఉన్నారు. ఏకంగా తమ పార్కింగ్ కింద వాడేస్తున్నారని వాపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయడంతో అటుగా ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరువైపులా కొన్ని వందల వాహనాలు ఉదయం నుంచి రాత్రి వరకు పార్కింగ్ చేసి ఉంచుతున్నారు. జీవీఎంసీ అధికారులు ఈ రోడ్డుగుండా వెళ్తున్నా పట్టించుకోవడం లేదు! ట్రాఫిక్ జామ్ అయితే పోలీసులు వచ్చి హడావుడి చేస్తారు. రోడ్డు పక్కన చిరు వ్యాపారులపై ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు కస్సుమంటూ మండిపడే అధికారులకు రోడ్డునే పార్కింగ్ చేసుకుంటున్నా కనిపించదా? అని ప్రజలు విమర్శిస్తున్నారు.

బెంగళూరు, షాలిమార్ ప్రత్యేక రైళ్ల పొడిగింపు

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ-బెంగళూరు, విశాఖ-షాలిమార్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-బెంగళూరు రైళ్లు జూన్ 1 నుంచి 30 వరకు, విశాఖ-షాలిమార్ రైళ్లు జూన్ 3 నుంచి 25 వరకు అందుబాటులో ఉంటాయన్నారు. విశాఖ-బెంగళూరు-విశాఖ: 08581 నంబరు గల రైలు జూన్ 1 నుంచి 29 వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.50 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.45 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08582 నంబరుతో జూన్ 2 నుంచి 30 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 3.50 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు దువ్వాడ, విజయవాడ, రేణిగుంట, జోలార్‌పేట మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు. విశాఖ-షాలిమార్-విశాఖ: 08508 నంబరు గల రైలు జూన్ 3 నుంచి 24 వరకు ప్రతి మంగళవారం ఉదయం 11.20 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు వేకువజాము 3 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08509 నంబరు గల రైలు జూన్ 4 నుంచి 25 వరకు ప్రతి బుధవారం ఉదయం 5 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 8.50 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు సింహాచలం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, ఖుర్దారోడ్డు, భువనేశ్వర్, కటక్, జైపూర్, కేంఝుహార్‌రోడ్డు, ఖరగ్‌పూర్, సంత్రాగచ్చి మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

అప్పల నరసింహంకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న గణబాబు, నాయకులు

అక్కయ్యపాలెం, మే 23 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీ పెతకంశెట్టి అప్పల నరసింహం 18వ వర్ధంతిని శుక్రవారం డైమండ్ పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పల నరసింహం విగ్రహానికి ఆయన కుమారుడు, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకొని ఉత్తరాంధ్రలో టీడీపీ బలోపేతానికి, బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తు చేశారు. ఆయన అడుగు జాడల్లో నేటి యువత నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, శరగడం రాజశేఖర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి హామీ


సహాయక ఇంజనీరుతో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు వరప్రసాద్, స్థానికులు

మురళీనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 50వ వార్డు తెన్నేటినగర్‌లో శుక్రవారం వీధి దీపాల నిర్వహణ విభాగం ఏఈ అర్చన పర్యటించారు. స్థానికులు కొద్ది రోజుల క్రితం జెడ్సీ పర్యటనలో ఇక్కడి నివాసిత ప్రాంతంలో వీధి దీపాలు వెలగని కారణంగా ఎదురవుతున్న ఇబ్బందుల్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జెడ్సీ సూచన మేరకు ఏఈ అర్చన వీధి దీపాల సక్రమ నిర్వహణ దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లైట్లు నిత్యం వెలిగేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. తెన్నేటినగర్ పార్క్ సహా నివాసిత ప్రాంతంలోని రోడ్లలో వెలగని వీధి దీపాలను గుర్తించారు. 50వ వార్డు టీడీపీ అధ్యక్షుడు వరప్రసాద్, కాలనీవాసులు సమస్యలను వివరించారు.

బాబోయ్.. దారంతా చెత్త



మాధవధార లాన్సమ్ అపార్ట్‌మెంట్స్ ఎదుట ఇలా...

మాధవధార, మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 51వవార్డు పరిధిలో పారిశుధ్య నిర్వహణ దయనీయంగా తయారైంది. వార్డులో రోడ్ల వెంబడి దారంతా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. లాన్సమ్ గ్రీన్స్ దారిలో నివాస సముదాయాల ఎదుట చెత్త పేరుకుపోయింది. ఈ దారిలోనే మాధవధార తోటల నుంచి సింహాచలం ఉపదేవాలయాలైన మల్లిఖార్జున స్వామి దేవాలయం, మాధవస్వామి, వేణుగోపాల స్వామి మందిరాలతో పాటు పిక్నిక్ స్పాట్‌గా ఉన్న సహజసిద్ధ జలధారల్ని చేరుకునేందుకు ప్రజలు రాకపోకలు సాగించాలి. ఇక్కడి వాటర్ పంప్ హౌస్ నంబర్ 19 వరకు వ్యర్థాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. పెద్ద చెత్తడబ్బా నిండిపోయి వ్యర్థాలు రోడ్డంతా చిందరవందరగా ఉన్నాయి. సక్రమంగా చెత్త తరలించడం లేదని స్థానిక విద్యానగర్, శంకర్‌నగర్ నివాసితులు సహా లాన్సమ్ గ్రీన్ అపార్ట్‌మెంట్ బహుళ అంతస్తుల నివాసితులు వాపోతున్నారు. వార్డు శానిటేషన్ ఇంచార్జి ఇన్‌స్పెక్టర్, జోన్-5 ప్రజారోగ్య విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బృందగానంలో అలనాటి గీతాలను ఆలపిస్తున్న గాయకులు

కళా రంగంలో మహిళల పాత్ర ఎనలేనిది

డాబాగార్డెన్స్, మే 23 (ఆంధ్రజ్యోతి) : కళా రంగంలో మహిళల పాత్ర ఎనలేనిదని, ముఖ్యంగా సంగీతంలో గాయనీమణులుగా తమదైన ప్రతిభతో ముందుకు వెళ్తున్నారని పలువురు కళారంగ ప్రముఖులు పేర్కొన్నారు. నారీ-భేరీ త్రయం భాగ్యలక్ష్మీ, సీవీఆర్ రాజేశ్వరి, శైలజ మీరాజ్ ఆధ్వర్యంలో పౌర గ్రంథాయలంలో శుక్రవారం ఎన్టీఆర్ వజ్రోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహా నటుడిగా ఎన్టీఆర్ ఎదిగిన తీరును కొనియాడారు. కార్యక్రమంలో జేసీ ఫౌండేషన్ నుంచి ఉషాచీరాల, కౌమాది అను, మస్తాన్‌రెడ్డి, ఎంవీఆర్ నాగేశ్వరరావు, సన్‌మూర్తి, భయ్యా శ్రీనివాస్, ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్, డి. భూపతిరావు పాల్గొన్నారు.

జ్ఞానాపురం రోడ్డుపై మురుగు నీరు


రోడ్డుపై నిలిచిపోయిన మురుగు నీరు

జ్ఞానాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానాపురం బస్‌స్టాప్ వెనుక ఉన్న రహదారిపై మురుగు నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలల క్రితం తాగునీటి సరఫరా పైపులైన్ల కోసం జీవీఎంసీ సిబ్బంది ఈ రోడ్డును తవ్వారు. తరువాత మట్టితో కప్పి, తారు వేయకుండా వదిలేయడంతో ఆ ప్రాంతం లోతట్టుగా మారింది. దీంతో డ్రైనేజీల్లోని మురుగు నీరు పొంగి రోడ్డుపై చేరుతోంది. ఇదే ప్రాంతంలో పాఠశాలలు, కళాశాలలు, బస్‌స్టాప్ ఉండడంతో విద్యార్థులతో పాటు ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనకు నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

టూటౌన్ పీఎస్‌ను తనిఖీ చేసిన సీపీ

మహారాణిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత సిబ్బంది విధులను సమీక్షించారు. అనంతరం స్టేషన్ పరిధిలోని సమస్యలను, కేసుల రికార్డులను పరిశీలించారు. సక్రమంగా లేని రికార్డులను పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. విదేశీయులు రూమ్స్ బుక్ చేసుకునే సమాచారం నమోదు విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సీపీ అవగాహన కల్పించారు. శుక్రవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో హోటళ్లు, గెస్టుహౌస్, ప్రైవేట్ హౌస్ వసతుల యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విదేశీయుల బస సమాచారం నమోదు, ఫామ్-సి వివరాల నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఫామ్-సిలో విదేశీయుడి పూర్తి పేరు, పాస్ పోర్టు నెంబరు, వీసా, దేశం పేరు కచ్చితంగా నమోదు చేయాలని పోలీసు కమిషనర్ సూచించారు.

యోగా డేను విజయవంతం చేయండి : కలెక్టర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలో జూన్ 21న జరిగే యోగా దినోత్సవాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్కే బీచ్ కాళీమాత ఆలయం ముందు ప్రధాన వేదికతో పాటు మిగిలిన ప్రాంతాల్లో వేదికలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన వేదిక వద్ద 15 వేల మంది భాగస్వామ్యం అవుతారని, అక్కడ నుంచి కొనసాగింపుగా పార్కు హోటల్ వరకు 50 వేల మంది పాల్గొంటారని తెలిపారు. ఒక్కొక్క కంపార్టుమెంట్‌లో వెయ్యి మంది కూర్చొనేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో 2.50 లక్షల మంది పాల్గొనే అవకాశం ఉండడంతో ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు అనువైన ఖాళీ ప్రదేశాలను పరిశీలించాలని ఆదేశించారు. ఆర్కే బీచ్ రోడ్డులో వేసిన శాశ్వత వేదిక వద్ద శనివారం ఉదయం జిల్లాస్థాయి యోగా డే నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ప్రజాప్రతినిధులు హాజరవుతారని కలెక్టర్ తెలిపారు.

కేజీహెచ్‌లో రోగులకు స్వచ్ఛమైన తాగునీరు

» 1.2 కోట్లతో ఆరు చోట్ల ఆర్ఓ ప్లాంట్లు

» త్వరలో మరో మూడు ఏర్పాటు



నిర్మాణంలో ఉన్న వాటర్ ప్లాంట్

మహారాణిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లో రోగులకు ఇకపై పూర్తిస్థాయిలో శుద్ధి చేసిన స్వచ్ఛమైన తాగునీరు అందించనున్నారు. ఈ మేరకు రూ. 1.20 కోట్లతో ఆస్పత్రి ఆవరణలో ఆరు ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుత వాతావరణం నేపథ్యంలో రోగులకు శుద్ధి చేసిన స్వచ్ఛమైన తాగునీరు అందించడం అవసరం. ఇప్పటివరకు రోగులు మినరల్ నీళ్ల సీసాలను బయట కొనుగోలు చేసుకుంటున్నారు. కొందరు ఆస్పత్రిలో ఉన్న కుళాయిల నీటితోనే దాహార్తి తీర్చుకుంటున్నారు. వార్డుల వారీగా చిన్న చిన్న ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసినా, అవి కొన్నిసార్లు మరమ్మతుకు గురవుతుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వాటి నిర్వహణ కూడా ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అత్యున్నత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సుజలం సేఫ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా రోగులకు శుద్ధి చేసిన తాగునీరు అందిస్తారు. వీటి నిర్మాణానికి దివీస్ కంపెనీ రూ.1.2 కోట్ల ఆర్థిక సహాయం అందజేసింది. వీటిని ఆరు చోట్ల ఏర్పాట్లు చేస్తున్నారు. సూపర్ స్పెషాలిటీ విభాగాలతో పాటు సీఎస్ఆర్ విభాగం, భావనగర్ రాజేంద్రప్రసాద్ చిన్నపిల్లల ఇన్ పేషెంట్ వార్డుతో పాటు ఓపీ, క్యాజువాలిటీ వద్ద అందుబాటులో ఉంచుతున్నారు. కేజీహెచ్‌లో కిడ్నీ రోగుల కోసం ఏర్పాటు చేస్తున్న మరో డయాలసిస్ యూనిట్ వద్ద కూడా ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయ నున్నారు. దీనికి విశాఖ పోర్టు అథారిటీ ఆర్థిక సాయం చేయనుంది.

కల్వర్టు పనులు త్వరగా పూర్తి చేయండి

» మేయర్ పీలా శ్రీనివాసరావు » వన్‌టౌన్ ప్రాంతంలో పర్యటన


స్థానిక నాయకులతో కలిసి వార్డులో పర్యటిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

మహారాణిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజల రవాణా సౌకర్యానికి ఇబ్బందులు లేకుండా కల్వర్టు పనులు త్వరగా పూర్తి చేయాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన 38వ వార్డు కార్పొరేటర్ గోడి విజయలక్ష్మితో కలిసి వన్‌టౌన్ ఏరియాలోని బురుజుపేట, కంచరవీధి, టౌన్‌హాల్, కనక మహాలక్ష్మి ఆలయం, శివాలయం వీధి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కొత్త రోడ్డులో జరుగుతున్న కల్వర్టు పనులను పర్యవేక్షించారు. కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం ఎదురుగా మరుగుదొడ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వార్డులో మలేరియా విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో మలేరియా సిబ్బంది అలసత్వాన్ని గుర్తిస్తే విధుల నుంచి తొలగించాలని, మలేరియా ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావుకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని ప్రధాన వైద్యాధికారిని ఆదేశించారు. అలాగే వీధుల్లో రోడ్డుపై ఉన్న బడ్డీలను తొలగించాలని చెప్పారు.

బదిలీల్లో న్యాయం చేయండి

» ఏజెన్సీకి బదిలీ అయిన మైదాన ప్రాంత ఉపాధ్యాయుల విజ్ఞప్తి

భీమునిపట్నం (రూరల్), మే 23 (ఆంధ్రజ్యోతి) : మైదాన ప్రాంతాల్లో పని చేస్తూ ఎనిమిదేళ్ల సర్వీసు నిండి తప్పనిసరిగా ఏజెన్సీకి బదిలీ అయిన ఉపాధ్యాయులు ప్రస్తుతం చేపడుతున్న బదిలీల్లో తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మూడేళ్ల క్రితం జరిగిన బదిలీల్లో జిల్లా వ్యాప్తంగా 350 మంది ఎస్‌జీలను మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి బదిలీ చేశారు. ఏజెన్సీ నుంచి ఏజెన్సీకి మాత్రమే బదిలీ చేయాలన్న నిబంధన ఉన్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక పోస్టులు రద్దు కావడంతో చాలా మంది ఉమ్మడి విశాఖలోని ఏజెన్సీలో ఉన్న 11 మండలాలకు తప్పనిసరిగా బదిలీ అయ్యారు. వారిలో ఎక్కువ మంది 50 ఏళ్లు పైబడిన ఉండగా, 200 మంది మహిళలు ఉన్నారు. రెండేళ్ల సర్వీసు పూర్తి చేస్తే బదిలీల్లో మైదాన మండలాలకు బదిలీ కావచ్చునని వారు ఎంతో ఆశ పడ్డారు. కానీ ప్రస్తుతం జరుగుతున్న బదిలీల కౌన్సెలింగ్‌లో వారికి ప్రాధాన్యత పాయింట్లు లేకపోవడంతో బదిలీ అయ్యే అవకాశాన్ని కోల్పోయారు. ఏజెన్సీలో ఏ మారుమూల పాఠశాల అయినప్పటికీ దాన్ని కేటగిరీ 3గానే గుర్తించారు. కేటగిరీ 3లో పనిచేస్తున్న వారికి ఏడాదికి మూడు మార్కులు మాత్రమే వస్తాయి. 2023లో బదిలీ అయిన ఈ ఉపాధ్యాయులందరికీ కేవలం 9 మార్కులు మాత్రమే వస్తాయి. దీంతో వారికి మైదాన మండలాలకు బదిలీ అయ్యే అవకాశం కల్పించడం లేదు.

ఇతర ఉద్యోగులకు ఒకలా.. ఉపాధ్యాయులకు మరోలా..

ఏజెన్సీలో ఎన్‌జీఓలు రెండేళ్ల కంటే అదనంగా పనిచేస్తే వారికి వచ్చే మార్కుల కన్నా అదనంగా 8 మార్కులు ఇస్తూ ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న ఉద్యోగులకు వారికి లభించే స్టేషన్ పాయింట్లతో పాటు ఏడాదికి 5 పాయింట్లు అదనంగా ఇస్తున్నారు. జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న వారికి స్టేషన్ పాయింట్లతో పాటు అదనంగా ఏడాదికి 8 మార్కులు ఇస్తున్నారు. వారంతా ఏజెన్సీలో ఉన్న మండల కేంద్రాల్లో పనిచేస్తుంటారు. వారికి అదనపు పాయింట్ల సదుపాయం ఉండగా మారుమూల కొండల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రం ఈ అవకాశం కల్పించలేదు. ఈ విషయమై పాలకులు, ఉన్నతాధికారులు స్పందించాలని ఏజెన్సీలో పని చేస్తున్న మైదాన ప్రాంత ఉపాధ్యాయులు కోరుతున్నారు.

డీఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

(5వ పేజీ తరువాయి)

ప్లాట్‌ఫామ్‌లపై పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. అనంతరం అమృత్ భారత్ పథకంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. స్టేషన్‌కు ఇరువైపులా ఉన్న సర్క్యులేటింగ్ ఏరియాను పరిశీలించి నిర్దేశిత సమయానికి పనులు పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. దువ్వాడ స్టేషన్ వద్ద కలిసిన జెడ్ఆర్‌యూసీసీ మెంబరు కె.ఈశ్వరరావు, వివిధ ఎన్జీవోల సంఘాల ప్రతినిధులు పలు సమస్యలు ప్రస్తావించగా...పరిష్కారానికి కృషిచేస్తామని డీఆర్ఎం హామీ ఇచ్చారు.

కరోనా టెన్షన్

(5వ పేజీ తరువాయి)

వేరియంట్‌ల వల్ల దేశంలో ఇప్పటివరకూ 257 కేసులు నమోదైనట్టు అధికారులు గుర్తించారు.

ఇవీ లక్షణాలు..

ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న వేరియంట్‌కు సంబంధించిన వైరస్ సోకిన వారిలో దగ్గు, గొంతునొప్పి, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, నీరసం, నిస్సత్తువ, కొందరికి కండ్ల కలక వంటి లక్షణాలు మూడు నుంచి వారం రోజుల పాటు ఉంటున్నట్టు చెబుతున్నారు. లక్షణాలను బట్టి మందులు అందిస్తారు. నగరానికి చెందిన 28 ఏళ్ల మహిళకు కరోనా పాజిటివ్ వచ్చిన విషయం తెలిసిందే.

ఆందోళన అవసరం లేదు

కరోనా వైరస్ గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో వారం కంటే ఎక్కువ రోజులు బాధపడుతుంటే అలసత్వం ప్రదర్శించవద్దు. వైద్యులను సంప్రతించి పరీక్షలు చేయించుకోవాలి. విమ్స్‌లో ప్రత్యేకంగా ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశాం. పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన ర్యాపిడ్ కిట్స్ కూడా సిద్ధం చేశాం. ప్రస్తుతం కొవిడ్ వైరస్ వేరియంట్ ఎక్కువగా ముంబై, కేరళల్లో వ్యాప్తి చెందుతోంది. గతంలో కూడా మొదట ఆయా ప్రాంతాల్లోనే కేసులు నమోదు కావడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. - డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్, కరోనా వైరస్ నోడల్ అధికారి

ఇంటి సర్వే

(5వ పేజీ తరువాయి)

అంతస్థు వేసినా 100 శాతం ఆస్తి పన్ను పెంచుతారు.

- ఎవరైనా ఇంటి ముందు దుకాణం పెట్టుకున్నా, ఆఫీసుకు అద్దెకు ఇచ్చినా దానిని వాణిజ్య భవనంగా పేర్కొంటూ ఆస్తి పన్ను రెండున్నర రెట్లు పెంచుతారు.

సక్రమంగా కడుతున్నవారికి ఇబ్బంది లేదు

ఇంటి విస్తీర్ణం ప్రకారం పన్నులు కడుతున్న వారిపై కొత్తగా పడే భారం ఏమీ ఉండదని అధికారులు చెబుతున్నారు. నిర్మాణాన్ని బట్టి పన్ను, నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి జరిమానాలు విధించేందుకు మాత్రమే సర్వే చేపట్టినట్టు చెబుతున్నారు.

కౌన్సిల్‌లో చర్చించాలి

ఏపీ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం ప్రకారం ఆస్తి పన్ను పెంపు లేదా జరిమానా విధించే అధికారం జీవీఎంసీ కౌన్సిల్‌కే ఉంటుంది. రీ సర్వేపై కౌన్సిల్‌లో చర్చించలేదు. వెంటనే సర్వే ఆపాలి. -బి.గంగారావు, కార్పొరేటర్, సీపీఎం ఫ్లోర్ లీడర్

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

(5వ పేజీ తరువాయి)

శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ 1995లో పెందుర్తి జడ్పీటీసీ సభ్యునిగా పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించింది నందమూరి తారకరామారావేనన్నారు. 2019-24 మధ్య దుర్మార్గుడి చేతిలో రాష్ట్రం నాశనం కావడంతో ప్రజలు గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ఏకపక్షంగా తీర్పు చెప్పారన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన పేదల పార్టీ కావడంతో తెలుగుదేశం ఉమ్మడి ఏపీలోనూ, ప్రస్తుతం నవ్యాంధ్రలోను మనుగడ సాగించగలుగుతుందన్నారు. దూరదృష్టితో పాలిస్తున్న చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలో 70 ఏళ్లు దాటిపోతున్న వారిని గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు. సీనియర్ నాయకులకు జిల్లా కమిటీలలో స్థానం కల్పించాలని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే పార్టీ ధ్యేయమన్నారు. మినీ మహానాడుకు అధ్యక్షత వహించిన విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ మాట్లాడుతూ విశాఖపట్నానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేస్తున్నారని అన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. మినీ మహానాడులో చేసిన తీర్మానాలను మహానాడుకు పంపిస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ఉత్తర నియోజకవర్గానికి వెంటనే ఇన్‌చార్జిని నియమించాలని కోరారు. ఇన్‌చార్జి లేకపోవడంతో నాయకులు, కార్యకర్తల ఇబ్బందులు పట్టించుకునేవారు లేరన్నారు. సమావేశంలో విశాఖ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, పార్టీ నాయకులు చోడే వెంకట పట్టాభి, కోరాడ రాజబాబు, అక్కరమాని విజయనిర్మల, వెల్లంకి భరత్, గొంప కృష్ణ, లొడగల కృష్ణ, తెలుగు మహిళ, యువత, బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు సర్వసిద్ధి అనంతలక్ష్మి, తాతాజీ, విజయకుమార్, బుడుమూరు గోవిందరావు, తోటరత్నం, ఈతలపాక సుజాత పాల్గొన్నారు.

ఉక్కులో బిక్కుబిక్కు

(5వ పేజీ తరువాయి)

అవకాశం లేదనే వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం నడుస్తున్న రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లకు తోడు జూన్ 20 నుంచి మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను కూడా ఆపరేషన్‌లోకి తేవాలని యత్నిస్తున్నారు. అయితే ప్లాంటులో అవసరమైనంత సిబ్బంది లేరు. దాదాపు 1,200 మంది ఉద్యోగులను వీఆర్ఎస్‌లో పంపించేశారు. ఓ 300 మంది వరకు రాజీనామాలు చేసి వెళ్లిపోయారు. ఇటీవల కాంట్రాక్టు కార్మికులు 2,500 మందిని తొలగించారు. ఇంకో 1,500 మంది తీసేయడానికి జాబితా సిద్ధం చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ కార్మికులు ఈ నెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. వచ్చే నెలలో మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రారంభించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. ఈ తరుణంలో అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవలసి ఉండగా, ఉన్నవారిని తొలగిస్తే ఉత్పత్తి ఎలా సాధ్యమనేది ఆలోచించడం లేదు.

కొత్త వారికి గేటు పాస్‌లు

ఈ మూడు రోజులు విధులకు హాజరుకాకుండా సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికులను తక్షణమే తొలగించాలని యాజమాన్యం కాంట్రాక్టర్లను ఆదేశించింది. వారి స్థానంలో కొత్త వారిని తీసుకోవాలని సూచించింది. వారికి వెంటనే గేటుపాస్‌లు ఇస్తామని పేర్కొంది. కొత్తగా పనులకు వచ్చేవారికి ఏ అనుభవం ఉండదని, వారితో ఏమి పనులు చేయించుకుంటామని విభాగాధిపతులు వాపోతున్నారు. ఇంకెన్ని ప్రమాదాలు జరుగుతాయోనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

సాగర తీరంలో అయోధ్య రామాలయం

ఆకట్టుకుంటున్న మందిరం నమూనా



బీచ్ రోడ్డులో ఏర్పాటుచేసి అయోధ్య నమూనా మందిరం

బీచ్ రోడ్డు, మే 23, (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బీచ్ రోడ్డులో పార్కు హోటల్ దరి నిర్మించిన అయోధ్య తరహా రామ మందిరాన్ని సందర్శకుల తాకిడితో కళకళలాడుతోంది. సుమారు 300 మంది కళాకారులతో రూపొందించిన అయోధ్య తరహా రామ మందిరం సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలను ఏర్పాటు చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్ మాట్లాడుతూ సుమారు 2 నెలల పాటు సందర్శకులకు ఆ ఆలయం అందుబాటులో ఉంచుతామని తెలిపారు. విశాఖ తీరాన సముద్రపు అలల మధ్య ఆధ్యాత్మిక భావం వెల్లివిరిసేలా ఆలయ నమూనాను తయారు చేయడం పలువురిని ఆనందింపజేస్తోంది.

స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయాలి

» మేయర్ 'పీలా'కు కార్పొరేటర్ మూర్తి యాదవ్ వినతి

సిరిపురం, మే 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో సాధారణ సమావేశంతో పాటు స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావును జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగర మేయర్ కార్యాలయంలోని విజ్ఞప్తి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరంలో జీవీఎంసీలో సాధారణ సమావేశం జరగలేదన్నారు. కేవలం బడ్జెట్ సమావేశం మాత్రమే జరిగిందన్నారు. బడ్జెట్ సమావేశంలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఖర్చులు, జమలు గురించి చర్చించి అవసరం మేరకు ఆర్థిక సంవత్సరం 2024-25 రివైజ్డ్ అంచనాలు ఆమోదించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26కు అవసరమైన బడ్జెట్ అంచనాలను పద్దుల ప్రకారం ఆర్థికపరమైన ఆమోదం ఇవ్వడం జరిగిందని తెలిపారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు పూర్తయిన నేపథ్యంలో చేపట్టబోయే కొత్త పనులు, నిర్వహణ పనులకు పరిపాలన పరమైన ఆమోదం పొందవల్సిన అవసరం ఉందన్నారు.ఆయా అంశాలపై దృష్టి సారించి నిబంధనలు మేరకు సాధారణ సమావేశం ఏర్పాటు చేసిన నగర పాలక సంస్థ పరిపాలన సజావుగా సాగేటట్టుగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

సినిమా గైడ్

- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం),సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం)
- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **నిశ్శబ్దప్రేమ** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం),
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: రమాదేవి, సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 28, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 18, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

కోవిడ్ కలకలంతో అప్రమత్తం

» స్థానికుల్లో మొదలైన భయాందోళనలు » మాస్కులు ధరించి బయటకు వస్తున్న జనం

మద్దిలపాలెం, మే 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీలో నమోదైన కరోనా కేసు కలకలం రేపింది. వివాహితకు కరోనా పాజిటివ్ అనే విషయం తెలియడంతో వార్డు ప్రజలు ఉలిక్కిపడ్డారు. 2020 ఏడాదిలో కోవిడ్‌తో ఎదురైన పరిణామాలను గుర్తు చేసుకుని భయాందోళనకు గురవుతున్నారు. ఈ వార్డులో ఎక్కడ చూసినా కోవిడ్ కేసు గురించే చర్చించుకుంటున్నారు. మూలన పడి ఉన్న మాస్కులు బయటకు తీశారు. చిన్నా పెద్ద మాస్కులు ధరిస్తున్నారు. పిల్లలను సైతం మాస్కులు ధరించి బయటకు తీసుకువస్తున్నారు. పాదచారులు కూడా మాస్కులు ధరించారు. పిఠాపురం కాలనీ ఏరియా మీదుగా వెళ్లే ప్రయాణికులు తప్పకుండా మాస్కులు పెట్టుకున్నారు. అంతేకాకుండా కాలనీ దరి రోడ్డుపై వ్యాపారస్తులు సైతం మాస్కులు ధరించారు. పిఠాపురంకాలనే కాకుండా శివాజీపాలెం, పీతలవానిపాలెం, మంగాపురం కాలనీ నివాసులు కూడా అప్రమత్తమయ్యారు.



మాస్క్ ధరించిన చిరు వ్యాపారి



మాస్క్ ధరించి బయటకు వెళుతున్న యువతి

నిత్యం రద్దీగా తిరిగే పిఠాపురంకాలనీ రోడ్డు కోవిడ్ కేసు నమోదైన విషయం బయటకు రాగానే నిర్మానుష్యమైంది. ఆయా ప్రాంత ప్రజలు అవసరం ఉంటేనే కాని బయటకు రావడానికి ధైర్యం చేయలేదు. జ్వరం, దగ్గు, జలుబు కలిగిన స్థానికులు వెంటనే ఆసుపత్రులకు పరుగులు తీశారు.

రోడ్డు ప్రమాదంలో పీజీ వైద్య విద్యార్థిని మృతి



మృతురాలు మునిలక్ష్మి (ఫైల్‌ఫొటో)

మద్దిలపాలెం, మే 23 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం జాతీయరహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైద్యురాలు మృతి చెందింది. వెనుక నుంచి లారీ ఢీకొనడంతో దుర్ఘటన జరిగింది. త్రీటౌన్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

తగరపువలస అక్షరసేతు వాహన అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న తెన్నేటి మునిలక్ష్మి (37) విజయవాడలో మెడికల్ పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె భర్త మృతి చెందాడు. కుమార్తెతో తండ్రి కృష్ణమూర్తి వద్దే ఉంటోంది. విజయవాడలోని కళాశాలకు వెళ్లేందుకు శుక్రవారం వేకువజామున తగరపువలస నుంచి తండ్రితో కలిసి బైక్‌పై బయలుదేరింది. మద్దిలపాలెం కూడలి దాటి సత్యం జంక్షన్ రోడ్డులో తండ్రీకుమార్తెలు బైక్‌పై వెళుతుండగా.., సిటీ కార్స్ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వస్తున్న లారీ వీరి బైక్‌ను బలంగా ఢీకొంది. దీంతో కృష్ణమూర్తి రోడ్డు పక్కకు ఎగిరిపడ్డారు. మునిలక్ష్మి లారీ వెనుక చక్రాల కింద పడి నలిగిపోవడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. త్రీ టౌన్ ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న కృష్ణమూర్తిని వైద్య నిమిత్తం, మునిలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కృష్ణమూర్తి అపస్మారక స్థితిలో ఉన్నారు. అతడికి వైద్యులు చికిత్స చేస్తున్నారు. పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతురాలిలు తల్లి పూర్ణచంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైపులైన్ పగిలి ఎగజిమ్మిన నీరు

» మరమ్మతు చేపట్టి చక్కదిద్దిన అధికారులు



పైపులైన్ పగిలి ఫౌంటెయిన్‌లా చిమ్ముతున్న నీరు



మరమ్మతులు చేసి సిమెంట్ వేస్తున్న దృశ్యం

నగరంలోని వీఐపీ మార్గంలో టైకూన్ హోటల్ సమీపాన జీవీఎంసీకి చెందిన పైపులైన్ శుక్రవారం ఉదయం పగిలిపోయి అందులో నీరు ఫౌంటెయిన్‌లా పైకి ఎగిసిపడింది. ఆ మార్గంలో వెళ్లిన వారంతా తడిచిపోయారు. వెంటనే అధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మరమ్మతులకు చర్యలు తీసుకొని, సమస్య పరిష్కరించారు. గొయ్యి లేకుండా సిమెంట్‌తో పూడ్చారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి.

యోగా డేను విజయవంతం చేయండి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలో జూన్ 21న జరిగే యోగా దినోత్సవాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్ర వారం ఆయన తన కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ఆర్కే బీచ్ కాళీమాత ఆలయం ముందు ప్రధాన వేదికతో పాటు మిగిలిన ప్రాంతాల్లో వేదికలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన వేదిక వద్ద 15 వేల మంది భాగ స్వామ్యం అవుతారని,అక్కడ నుంచి కొనసాగింపుగా పార్కు హోటల్ వరకు 50 వేల మంది పాల్గొంటారని తెలిపారు. ఒక్కొక్క కంపార్టుమెంట్‌లో వెయ్యి మంది కూర్చోనేలా తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో 2.50 లక్షల మంది పాల్గొనే అవకాశం ఉండడంతో ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు అనువైన ఖాళీ ప్రదేశాలను పరిశీలించాలని ఆదేశించారు.

కాగా వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం ఆరేకే బీచ్ రోడ్డులో వేసిన శాశ్వత వేదిక వద్ద జిల్లాస్థాయి యోగా డే నిర్వహించనున్నట్టు చెప్పారు. దీనికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాం జనేయ స్వామి, జిల్లాకు చెందిన ప్రజాప్రతి నిధులు హాజరు కానున్నారు.

భవన కొలతల రీసర్వే వెంటనే నిలిపివేయాలి



మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు

సిరిపురం, మే 23 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ విస్తీర్ణ కొలతలు సరిగా లేవన్న నెపంతో, మరోసారి 20 శాతం ఆస్తి పన్ను పెంపు కోసం చేపట్టిన భవన కొలతల రీసర్వే వెంటనే నిలిపి వేయాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మేయర్ ఛాంబర్‌లో ఆయనను గంగారావు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ వెంటనే జీవీఎంసీ కౌన్సిల్‌ను సమావేశ పర్చాలని కోరుతున్నామన్నారు. ప్రతి భవన ఆస్తి పన్ను ప్రస్తుత ఆస్తి పన్నుపై ఈ ఏడాది కనీసం 20 శాతం పెరుగుతుందని ఇది కాక మరో 15 శాతం ప్రతీ ఏడాది ఆస్తి పన్ను పెంచే విధానం కొనసాగుతుందన్నారు. ఇంటి ప్లాన్ 10 శాతంపైన ఉల్లంఘించి ఇళ్లు నిర్మిస్తే అదనంగా 50 శాతం పెనాల్టీ విధిస్తారన్నారు. ఇంటికి ప్లాన్ లేకపోయినా లేదా ప్లాన్ ఉండి అదనపు అంతస్తు వేసినా దానికి మరో 100 శాతం ఆస్తి పన్ను పెనాల్టీ వేస్తున్నారన్నారు. ఇంత దారుణంగా ఆస్తి పన్ను పెంచడం సరైన విధానం కాదన్నారు. కాబట్టి ఆస్తి పన్ను పెంచడానికి, పెనాల్టీలు విధించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన భవనాల రీ సర్వే జీవీఎంసీలో తిరస్కరించాలని కోరుతున్నామన్నారు. ఆస్తి పన్ను తగ్గింపునకు మేయర్ నేతృత్వంలో అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్ల బృందాన్ని ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లాలని కోరుతున్నామన్నారు.

రూ.1.5 కోట్లతో చీటీల వ్యాపారి పరారీ

» బాధితుల ఫిర్యాదుతో మహిళపై కేసు నమోదు

గాజువాక, మే 23 (ఆంధ్రజ్యోతి) : శ్రీనగర్ అఫిషియల్ కాలనీలో చీటీలు నిర్వహించి ఖాతాదారులకు కోటి యాభై నాలుగు లక్షల రూపాయలు టోకరా వేసి పరారైన ఓ మహిళపై గాజువాక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి.

శ్రీనగర్ అఫిషియల్ కాలనీలో ఎం.చిట్టమ్మ అనే మహిళ స్థానికంగా నమ్మకంటీ ఉంటూ నెలవారీ, రోజు వారి, పండుగ చీటీలు నిర్వహించేది. చీటీలు పాడుకున్న వారికి నగదు ఇవ్వకుండా కాలయాపన చేసింది. నగదు చెల్లించమని అడిగితే సరిగా సమాధానం చెప్పేదికాదని బాధితులు పోలీసులకు తెలిపారు. అయితే రెండు నెలల నుంచి చిట్టిమ్మతో పాటు ఆమె కుటుంబ సభ్యులు కూడా ఇంటి వద్ద కనిపించడం లేదని, ఇంటికి తాళం వేసి ఉందని పలువురు ఖాతాదారులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని గాజువాక పోలీసులను ఆశ్రయించారు.

బాధితుల ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవుల తరలింపును అడ్డుకున్న పోలీసులు



పెందుర్తిలో పట్టుబడ్డ గోవులతో ఉన్న కంటైనర్

పెందుర్తి, మే 23 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కంటైనర్లలో తరలిస్తున్న గోవులను పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. సీఐ సతీశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా నుంచి కంటైనర్ (గూడ్స్ లారీ)లో పెందుర్తి మీదుగా గోవులను తరలిస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందింది.దీంతో సీఐ కేవీ సతీశ్‌కుమార్, పోలీసులు పినగాడి హైవే రోడ్డు వద్ద మాటు వేశారు. ఈ క్రమంలో ఎన్‌హెచ్-16లో ఆనందపురం నుంచి పెందుర్తి వైపు వస్తున్న వాహనాల ముమ్మర తనిఖీ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఓ కంటెయినర్‌ను గమనించిన పోలీసులు తనిఖీలు చేపట్టగా 47 గోవులు ఉన్నట్లు గుర్తించారు. గోవులను కుక్కి తాళ్లతో కట్టేయడంతో ఊపిరాడక అల్లాడుతున్నాయి. లారీకి సంబంధించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. కంటైనర్ తమిళనాడు వెళుతున్నట్లు తెలిసిందన్నారు. పార్వతీపురం సంతలో తక్కువ ధరకు గోవులను కొనుగోలు చేసి తరలిస్తున్నారని పేర్కొన్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నామని సీఐ తెలిపారు.

గృహ వినియోగ సిలిండర్లు సీజ్



అధికారులు సీజ్ చేసిన సిలిండర్లు

సిరిపురం, మే 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఎదురుగా ఉన్న శ్రీనుబాబు కోడి పోలావ్‌లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వినియోగం దర్జాగా కొనసాగిచేస్తున్నారు.నిత్యం వేలాది మంది ఈ రహదారుల మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. అసలే ప్రెజర్ ఎక్కువగా ఉండే పైపుల ద్వారా గ్యాస్ వినియోగాన్ని చేస్తుంటారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో శుక్రవారం సర్కిల్-2 చెకింగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు నిర్వహించి వినియోగిస్తున్న మూడు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌లను సీజ్ చేశారు.

మహిళ మృతికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌కు జైలు, జరిమానా

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి) : బస్సును అజాగ్రత్తగా నడిపి మహిళ మృతికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌కు ఏడాది కఠిన కారాగార శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధిస్తూ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ఇందుకు సంబంధించి అదనపు పబ్లిక్ సీనియర్ ప్రాసిక్యూటర్ ఫైలపల్లి ఆదినారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్‌జి ప్రకాష్ ప్రకాష్ 2023, సెప్టెంబరు 29న వన్‌టౌన్ పరిధిలో చిలకపేట బస్టాప్ వద్ద ఓ మహిళను బస్సుతో ఢీకొని ఆమె మృతికి కారణమయ్యాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి సాక్షాలు కోర్టులో హాజరు పరిచారు. కోర్టులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు ప్రారంభం



భూగర్భ విద్యుత్తు కేబుల్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, మే 23 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు భూగర్భ విద్యుత్తు కేబుల్ నిర్మాణ పనులను ఎంవీపీ కాలనీలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం ప్రారంభించారు. 33 కేవీ కేబుళ్లను ఈ ప్రాజెక్టులో వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో పదిహేడో వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి ,, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యానిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరామ్, ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలంనాయుడు, వేణుగోపాలరావు, డీఈఈ సమన్, ఏఈఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ అరెస్టు

» 5,75 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

» నిందితుడు శ్రీకాకుళం జిల్లా వాసి



నిందితుడు ఎస్.రాజేశ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

కూర్మన్నపాలెం, మే 23 (ఆంధ్రజ్యోతి) : పలు చోరీలకు కేసుల్లో ఉన్న దొంగను దువ్వాడ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఈ నెల 21న 86వ వార్డు సైమన్ నగర్‌లో నివాసముంటున్న ఓ మహిళ సాయంత్రం వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి బైకు వచ్చిన యువకుడు ఆమె మెడలో ఉన్న మూడు తులాల పుస్తెల తాడు తెంచుకొని పరారయ్యాడు. బాధిత మహిళ 112కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. సీపీ ఆదేశా లు మేరకు దువ్వాడ క్రైమ్ ఎస్సై విలియమ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నిందితుడు ఎన్.రాజేశ్‌గా గుర్తించారు. శుక్రవారం పోలీసులు శుక్రవారం దువ్వాడ రైల్వే స్టేషన్ సమీపంలోని మంగలపాలెం వద్ద మాటువేసి నిందితుడు రాజేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. నిందితుడిపై 7 క్రిమినల్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. నిందితుడి నుండి చోరీకి గురైన 3 తులాలు బంగారు గొలుసు, గాజువాక కేసుకు సంబంధించి 2.75 తులాలు గొలుసును స్వాధీనం చేసుకున్నారు.ముద్దాయి శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం భైరిపురం గ్రామానికి వ్యక్తి అని పోలీసులు తెలిపారు. ఇతడు ఇంటి నుంచి బయటకు వస్తున్న మహిళలు తమ బంగారు ఆభరణాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

ఆర్థిక ఇబ్బందులతో కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య



మృతదేహం, (ఇన్‌సెట్‌లో) కనకరావు (ఫైల్‌ఫొటో)

కూర్మన్నపాలెం, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి సమీపంలో దానబోయినపాలేనికి చెందిన ఉక్కు ఉద్యోగి కర్రి కనకారావు, తన బార్య రమణమ్మ పిల్లలు అప్పలరాజు, బిందు నూకరత్నంలతో నివాసముంటున్నాడు. కనకారావు తన ఇరువురు పిల్లలకు వివాహాలు జరిపించాడు. తన కుమారుడు కర్రి అప్పల రాజు (37)కు, అనకాపల్లి జిల్లా మాకవరపాలేనికి చెందిన అరుణతో 2014లో వివాహం జరిపించాడు. అప్పలరాజు, తన భార్య అరుణ, బాబు దినేష్, పాప ప్రత్యూషతో తన తల్లిదండ్రులకు సమీపంలో వేరే ఇంటిలో నివాముంటున్నాడు. ఉక్కు కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్న అప్పలరాజు భార్య అరుణకు తెలియకుం డా సుమారు రూ.5 లక్షలు అప్పులు చేశాడు. మద్యానికి అలవాటు, జులాయిగా తిరుగుతూ అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో అప్పులు చేశాడు. ఈ అప్పులు విషయం భార్యకు తెలియడంతో భార్యభర్తల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో అరుణ పిల్లలను తీసుకొని రెండు వారాలు క్రితం మాకవపాలెంలోని పుట్టింటికి వెళ్లిపోయింది.

తన పిల్లలు దూరమవడంతో అప్పలరాజు తీవ్ర ఆవేదనకు గురయ్యేవాడు. అప్పలరాజు గురువారం రాత్రి తల్లిదండ్రులు వద్దకు వెళ్లి తన బట్టలను ఆరవేసి, కాసేపు మాట్లాడి తిరిగి తన ఇంటికి వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం ఏ షిఫ్టు విధులకు వెళ్లాల్సిన అప్పలరాజుడ్యూటీకి రాకపోవటంతో ఉక్కు అధికారి.. అప్పలరాజు తండ్రి అయి న ఉక్కు ఉద్యోగి కర్రి కనకారావుకు సమాచారం తెలిపి, అప్పలరాజును జనరల్ షిఫ్టుకు రమ్మని సూచిం చారు. ఈ విషయాన్ని కనకారావు, తన భార్య రమణమ్మకు ఫోన్ చేసి సమాచారం అందించారు. అప్పలరాజుకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో రమణమ్మ సమీపంలో ఉన్న అప్పలరాజు ఇంటికి వెళ్లి తలుపు కొట్టింది. లోపల గడియ పెట్టి ఉండడంతో ఇరుగు పొరుగు వారి సహాయంతో తలుపులు బద్దలు కొట్టించి చూడగా, అప్పలరాజు బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని మృతి చెంది ఉన్నాడు. దీంతో దువ్వాడ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకొన్న దువ్వాడ పోలీసులు అప్పలరాజు మృతదేహాన్ని పరిశీలించి, ఆత్మహత్య కేసుగా నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. తల్లి కర్రి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

ఉక్కుటౌన్‌షిప్, మే 23 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. విధులకు హాజరయ్యే వారి సంఖ్య రోజురోజుకూ తగ్గుతోంది. దీంతో సమ్మె లో పాల్గొనే కార్మికుల సంఖ్య పెరుగుతోంది. తొలి రోజు (20వ తేదిన) సుమారు 60 శాతం మంది కార్మికులు విధులకు హాజరు కాగా, 21, 22 తేదీల్లో 50 శాతం మంది కార్మికులు విధులకు హాజరయ్యారు. శుక్రవారం మాత్రం సుమారు 40 శాతం మంది కార్మికులు మాత్రమే విధులకు హాజరయ్యారు. కొన్ని ప్రధాన విభాగాల్లో కాంట్రాక్టు కార్మికులు తప్పనిసరి పరిస్థితుల్లో హాజరు కావాల్సి వస్తోంది. కాంట్రాక్టు కార్మికుల తొలగింపుపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకూ నిరవధిక సమ్మె విరమించేది లేదని కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు.

కలర్‌ఫుల్‌గా కలుషితం



(ఆంధ్రజ్యోతి-అక్కిరెడ్డిపాలెం)

విశాఖ సుందర నగరంలో నిన్న, మొన్నటి వరకు సూర్య భగవానుడు ప్రజలపై తన విశ్వరూపాన్ని చూపాడు. భగభగ మండే వేసవిలో బయటకు వెళ్లి ఇంటికి రాగానే ఉపశమనం కోసం తహతహలాడుతూ చల్లని నీటిని లేదా మజ్జిగను కోరుకోవడం సహజం. పనుల నిమిత్తం బయటకు వెళ్లి సమయానికి ఇంటికి తిరిగి రాలేనివారు మాత్రం రోడ్ల పక్కన విక్రయించే రంగుల సోడాలు, ఇతర పానీయాలను కొనుగోలు చేసి తాగుతుంటారు. ఇవి పిల్లలనే కాదు.. పెద్దలనూ ఆకర్షిస్తుంటాయి. వీటిని తాగడం ఆరోగ్యానికి హానికరమని, రోగాలు కొని తెచ్చుకోవడమేనని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సుగంధి.. వేసవి తాపం తీర్చే దివ్య ఔషధం. మొక్క వేళ్లను ఎండబెట్టి.. ఆపై ఉడకబెట్టి కషాయం తీసి.. సుగంధిని తయారు చేస్తారు. కానీ, ఇది ఒకప్పటి మాట.. నేడు మార్కెట్‌లో లభించే సుగంధిని కృత్రిమంగా తయారు చేస్తున్నారు. ఇది తెలియక దాహం తీర్చుకోవడానికి అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నాం. ఆహార తనిఖీ అధికారులు పట్టనట్లు వ్యవహరించడంతో ఈ కల్తీ దందా మూడు రంగునీళ్లు.. ఆరు పానీయాలుగా సాగుతోంది. రసాయనాలు కలిపిన పానీయాల జోలికి వెళ్లకుండా పండ్లరసాలు తాగేందుకు సాధ్యమైనంత వరకు ప్రాధాన్యమివ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఒకప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఓ సీసాలో నీటిని తీసుకుని వెళ్లేవారు. ప్రస్తుతం బయట శుద్ధ జలం పేరిట సీసాల్లో నీళ్ల విక్రయిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో మార్కెట్‌లో దొరికే శీతల పానీయాలు తాగేందుకు ఆసక్తి చూపుతుంటారు. వేసవిలో శీతల పానీయాలకు డిమాండ్ ఉండడంతో జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లోని పలు కూడళ్లలో దుకాణాలు వెలిశాయి. షర్బత్, రస్నా, ద్రాక్ష జ్యూస్, లెమన్ వాటర్,

జోరుగా రంగుల పానీయాల విక్రయం

సుగంధి తదితర పేర్లతో పలు రకాల పానీయాలు విక్రయిస్తున్నారు. రంగుల సీసాల్లో ఎంతో ఆకర్షణీయంగా కనిపించే వీటిని తాగుతున్నప్పుడు బాగున్నా.. పలుచోట్ల పానీయాల తయారీలో సరైన జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల అనారోగ్యం కొని తెచ్చుకోక తప్పదు. కడుపులో మంట, నొప్పి, విరేచనాలు వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. విచ్చలవిడిగా రోడ్ల పక్కన వీటిని విక్రయిస్తున్నా ఆహార తనిఖీ అధికారులు నిరోధించిన దాఖలాలు లేవు.

బొట్టు బొట్టులో రసాయనమే...

శీతల పానీయాలు షర్బత్, సుగంధి, ఆరంజ్, ద్రాక్ష వంటి పండ్ల రసాల్లో సైతం కార్బైట్ ఇథోఫిన్ (పిచికారీ చేసిన రసాయనాలు) ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. వీటిని తాగడం వల్ల మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఇందులో కలిపిన రసాయనాలతో క్యాన్సర్ తదితర వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. నిమ్మరుచిని తీసుకువచ్చేందుకు ప్రమాదకరమైన నిమ్మ ఉప్పు వంటి వాటిని కలుపుతున్నారు. కృత్రిమంగా తయారు చేసే రసాయన పానీయాలతో దీర్ఘకాలంలో



సీసాల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్న రంగుల పానీయాలు

మితిమీరిన రసాయనాలు... శుభ్రత శూన్యం

- తాగితే అనారోగ్యం కొని తెచ్చుకున్నట్లే...
- పట్టించుకోని ఆహార తనిఖీ అధికారులు

ఆరోగ్యంపై ఎంతో ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు.

రోగాలు తెచ్చే ఐస్...

శీతల పానీయాల్లో ప్రధానంగా వినియోగించేది ఐస్. దీని తయారీలో సరైన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఐస్ తయారీలో శుద్ధ నీటిని మాత్రమే వినియోగించాలి. కానీ పలుచోట్ల ఐస్ గోదాములలో ఎటువంటి నియమాలు పాటించకుండా ఐస్ తయారుచేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ఐస్‌ను శీతల పానీయాల్లో వేసేందుకు ముక్కలను వాహన ట్యూబ్‌లో వేసి కొడుతుంటారు. ఈ క్రమంలో ఐస్ వేసిన పానీయం తాగితే మలినాలు నేరుగా కడుపులోకి చేరుతాయి. శీతలంగా ఉన్న ప్రాంతంలో ప్రమాదకరమైన బ్యాక్టీరియాలు తోడవుతుంటాయి.. అయితే వీటి నిర్మూలనకు ఐస్ తయారు చేసే నిర్వాహకులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల మన ఒంట్లో చేరి హాని కలిగిస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అతిసార బారిన పడినట్లే...

శీతల పానీయాలు విక్రయించే దుకాణాల్లో ఈగలు వాలడం, గ్లాసులు సరిగా శుభ్రం చేయకపోవడం వలన వాటితో అతిసార, ఉదర సంబంధ వ్యాధులను కొనితెచ్చుకున్నట్లే. పానీయాలు శీతల గదిలో నిలవ చేయాలి, కానీ నిర్వాహకులు వాటిని మండుటెండల్లో ఉంచుతున్నారు. తాగేటప్పుడు మాత్రం ఐస్ వేసి చల్లగా చేస్తున్నారు. నిల్వ ఉన్న శీతల పానీయాలు తాగితే విషతుల్యంగా మారే ప్రమాదం ఉంది. కాలం చెల్లిన ప్లాస్టిక్ సీసాలలో వీటిని నిలువ ఉంచుతున్నారు. ఎండ వేడికి రసాయన చర్య జరిగి మరింత విషంగా మారుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రసాయనాలతో దీర్ఘకాలిక వ్యాధులు



మంచినీళ్లు, గ్యాస్, కూలింగ్ వంటివి సరైన రీతిలో వినియోగించకుండా కృత్రిమంగా తయారు చేసిన ఈ రంగుల పానీయాలను తాగడం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ముఖ్యంగా గోదాములలో ఐస్ తయారీలో వాడే నీటిని, దుకాణాలలో ఐస్ నిల్వచేసే గోనె సంచులు, వాహన ట్యూబ్‌ల వలన అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి వాటిని దీర్ఘకాలం తీసుకోవడం వల్ల మధుమేహం, రక్తపోటుతో పాటు ఉదర సంబంధ వ్యాధులు వస్తాయి. శీతల పానీయాల్లో రసాయనాలను వాడటం వల్ల రోగాలు సంక్రమిస్తాయి. చర్మం ముడతలు పడడంతో పాటు జీర్ణవ్యవస్థ దెబ్బతింటుంది. వేసవిలో కొబ్బరి నీళ్లు, ఇళ్లల్లో చేసే పండ్ల రసాలు, మజ్జిగ వంటివి తీసుకోవడం ఆరోగ్యకరం.

- డాక్టర్ ఆర్‌వి రవి కన్న
జనరల్ ఫిజీషియన్, కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి

క్రైం... crime news

రైలు ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెందుర్తి, మే 23 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం రైల్వే ట్రాక్ దాటుతుండగా ఓ రైలు ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసు అధికారి అబ్దుల్ మారూఫ్ తెలిపారు. మృతుడు స్థానికేతరుడు. గ్రే కలర్ జీన్, వైట్ కట్ బనియన్ ధరించి ఉన్నాడని, మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసు అధికారి తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసినవారు 94948 87786 సెల్ నెంబరును సంప్రదించాలన్నారు.

యువకుడి ఆత్మహత్య



నాగభూషణం (ఫైల్‌ఫొటో)

భీమునిపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నేరెళ్లవలస కాలనీలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భీమిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన దండు నాగభూషణం (25) డ్రైవర్. ఆటో, కారు, లారీ ఎక్కడ ఏ పని లభిస్తే అక్కడికి వెళుతుంటాడు. అలాగే రోజువారీ కూలి పనులకు కూడా వెళుతుంటాడు. అతని తండ్రి కూడా వ్యాన్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. మూడు నెలలు నుంచి నాగభూషణం మానసిక స్థితి బాగా లేకపోవడంతో నగరంలోని ప్రభుత్వ మానసిక రోగుల ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఆకలిగా ఉంది, టిఫిన్ కావాలని చెప్పడంతో అతని తల్లి లక్ష్మి దుకాణానికి వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంట్లోని తాటి దూలానికి చీరతో ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే స్థానికుల సహకారంతో కిందకు దించే సరికి అప్పటికే మృతి చెందాడు. తన ఆరోగ్య పరిస్థితి బాగోలేక ఆత్మహత్య చేసుకున్నట్టు సూసైడ్ నోట్ రాసినట్టు పోలీసులు తెలిపారు. నాగభూషణం తండ్రి నూకరాజు నాలుగేళ్ల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. లక్ష్మి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ నూకరాజు కేసు నమోదు చేశారు.

మానసిక ఒత్తిడితోనే వైద్య విద్యార్థి బలవన్మరణం

మహారాణిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర వైద్య కళాశాలలో పీజీ చదువుతున్న సింగపురం మోతీలాల్ (25) మానసిక వ్యాధితోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. విద్యార్థి మృతదేహానికి కేజీహెచ్‌లో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కుటుంబ సభ్యులను పోలీసులు విచారించినప్పుడు కొన్ని నెలలుగా అతను తీవ్ర మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. పీజీ నీట్‌లో సీటు కోసం చదువుతూ ఒత్తిడికి గురయ్యాడని, మానసిక వైద్యం అందించామన్నారు. గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తెలిపారు. అతనికి చికిత్స అందిస్తున్న వైద్యులు కూడా అత్యంత తీవ్రమైన మానసిక వ్యాధితో బాధపడుతున్నట్టు రిపోర్టులో పేర్కొన్నారు. ఆ రిపోర్టులను, వాడుతున్న మందులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మోతీలాల్ చదువులో మెరిట్ విద్యార్థి. జిప్‌మర్ పాండిచ్చేరిలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, పీజీ నీట్ ఎంట్రన్స్‌లో మెరుగైన ర్యాంక్ రావడంతో రేడియాలజీ విభాగంలో ఆంధ్ర వైద్య కళాశాలలో మూడు నెలల క్రితం చేరాడు. కేజీహెచ్ ఏఎంసీ పీజీ వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్నాడు. ఎక్కువగా ఒంటరితనానికి గురై ముభావంగా ఉండేవాడని తోటి విద్యార్థులు చెబుతున్నారు. బాగా తెలివైన విద్యార్థి ఉన్నత చదువులు చదువుతూ మానసిక వ్యాధితో ఆత్మహత్యకు పాల్పడడంతో ఏఎంసీలో తీవ్ర విషాదం నెలకొంది.

4న ఎలమంచిలిలో ఉమ్మడి రాష్ట్రస్థాయి పాటల పోటీలు

ఎలమంచిలి, మే 23 : (ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి సందర్భంగా వచ్చే నెల 4వ తేదీన ఎలమంచిలిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్టు కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ మత్తుర్తి రామారావు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని గురవప్ప కల్యాణ మండపంలో ఉదయం ఎనిమిది గంటలకు మహిళలు, పురుషులకు సోలో, డ్యూయట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.4 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు, కన్సొలేషన్ బహుమతి రూ.1,000 నగదుతోపాటు జ్ఞాపికలను అందజేస్తామని, ఎంట్రీ ఫీజు రూ.100 చెల్లించాల్సి వుంటుందని పేర్కొన్నారు. పేర్ల నమోదు కోసం యల్లపు పైడికొండ- 76759 09588, కిర్లంపల్లి మల్లీశ్వరరావు- 95533 68503, మత్తుర్తి రామారావు- 81848 03083 నబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన కోరారు.

పనిష్మెంట్లు సరళీకృతం చేయడంపై ఆర్టీసీలో సంబరాలు



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్



స్వీట్లు తినిపించుకుంటున్న ఎన్‌ఎంయూఏ నాయకులు, కార్యకర్తలు

ద్వారకాబస్‌స్టేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులకు యాజమాన్యం ఇచ్చే పనిష్మెంట్లను సరళీకృతంచేస్తూ అందరికీ ఒకే విధంగా అమలు చేసేలా వెలువడిన 1/19 సర్క్యులర్‌ను పునరుద్ధరించడంతో ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్‌ఎంయూఏ) సంబరాలు చేసుకుంది. 2019లో అమల్లోకి వచ్చిన ఈ సర్క్యులర్, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమైన తరువాత రద్దయ్యింది. ఆర్టీసీ ఉద్యోగులకు యాజమాన్యం ఇచ్చే పనిష్మెంట్లు కఠినంగా ఉండేవి. రద్దు చేసిన 1/19 సర్క్యులర్‌ను తిరిగి పునరుద్ధరించాలని ఎన్‌ఎంయూఏ నాలుగు నెలలుగా రాష్ట్రస్థాయిలో ఆందోళనలు చేపట్టింది. దీనికి స్పందించిన ప్రభుత్వం ఈ సర్క్యులర్‌ను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనితో మద్దిలపాలెం, వాల్తేరు, విశాఖపట్నం, మధురవాడ, గాజువాక, స్టీల్‌సిటీ, సింహాచలం డిపోల్లో ఎన్‌ఎంయూఏ శాఖలు శుక్రవారం సంబరాలు చేసుకున్నాయి. పరస్పరం మిఠాయిలు తినిపించుకున్నారు. డిపోల గేట్ల ఎదుట సమావేశాలు నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర రవాణా శాఖకు కృతజ్ఞతలు తెలిపాయి. మద్దిలపాలెం డిపోలో ఎన్‌ఎంయూఏ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పీవీ మోహన్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కేఎస్ఎన్ మూర్తి, డిపో శాఖ అధ్యక్షుడు ఎంఈ రావు, కార్యదర్శి చిన్నా పాలవర్తి, రీజనల్ నాయకులు శివదేవ్, రవి రాజు తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ హత్య

- కేసును ఛేదించిన ప్రత్యేక బృందం
- మహారాణిపేట పోలీసులు కేసును మూసేయడంతో సీపీని ఆశ్రయించిన హతురాలి కుమార్తె
- నాలుగేళ్ల తరువాత నిందితుడి అరెస్టు



హత్యకు గురైన పల్లా గీత (ఫైల్)




వివరాలు వెల్లడిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

మహారాణిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల క్రితం ఒక మహిళ అదృశ్యం కాగా విచారించిన మహారాణిపేట పోలీసులు కనిపించలేదంటూ కేసును మూసేశారు. న్యాయం చేయాలని ఆమె కుమార్తె సునీత పోలీసు కమిషనర్‌ను కోరటంతో ప్రత్యేక బృందంతో కేసును తిరిగి దర్యాప్తు చేయించారు. సాక్షుల విచారణ, సాంకేతికత జోడించి పక్కా ఆధారాలతో ఆమె పాశవికంగా హత్యకు గురైనట్లు గుర్తించారు. హత్యకు పాల్పడి నాలుగేళ్లుగా బయట దర్జాగా తిరుగుతున్న నిందితుడు అలుగు దివాకర్‌ను అరెస్టు చేసినట్లు పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కమీషనరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పల్లా గీత (45) తన భర్తతో విభేదాల కారణంగా మహారాణిపేట పోలీసు స్టేషన్ పరిధిలోని సూర్యాబాగ్ వద్ద తన తల్లి దండ్రుల ద్వారా సంక్రమించిన ఒక అపార్టుమెంట్‌లో ఒంటరిగా ఉండేది. తన ఉంటున్న ఫ్లాట్‌లో ఓ సమస్య వచ్చినప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారి దివాకర్ పరిష్కరించాడు. ఆ పరిచయంతో ఆమె అతనికి దగ్గరయ్యింది. ఆమె ఉంటున్న ఫ్లాట్‌లోనే దివాకర్ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. అంతేకాకుండా దివాకర్‌ను నమ్మి అతనికి కావలసిన వారికి లక్షలాది రూపాయలు అప్పు ఇచ్చింది. ఇద్దరూ ఒకే ఫ్లాట్‌లో ఉండటంతో వారి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. తనను పెళ్లి చేసుకోవాలని దివాకర్‌ను బలవంతం చేయటం ప్రారంభించింది. అయితే దివాకర్‌కు పెళ్లి చేసుకోవడం ఇష్టంలేదు. అది గ్రహించిన గీత ఏకంగా బుచ్చిరాజుపాలెంలో నివాసం ఉంటున్న దివాకర్ దగ్గరకు వెళ్లి తనను వివాహం చేసుకోవాలంటూ బహిరంగంగా అతడి ఇంట్లోనే కూర్చుంది. వివాహానికి అంగీకరించక పోవటంతో ఇరువురి మధ్య తీవ్రంగా ఘర్షణ జరిగింది. తనను జీవితాంతం ఇలాగే వేధిస్తుందని, ఆమెను లేకుండా చేయాలని ఒక నిర్ణయానికి వచ్చాడు. ఇంటిలో ఎవరూ లేని సమయం చూసుకొని ఘర్షణ పడి ఆమె తలను బలంగా ప్రాణం పోయేంతవరకు గోడకు కొట్టి చంపాడు. హైదరాబాద్‌కు చెందిన తన రియల్ ఎస్టేట్ స్నేహితుడు వరప్రసాద్ సహాయంతో గీత మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి తన కారు వెనుక సీటులో పడుకోబెట్టి అర్ధరాత్రి సమయంలో తూర్పుగోదావరి జిల్లా ఎర్రవరం వద్ద పారుతున్న ఎర్రకాలువలో విసిరేశాడు. అనంతరం హైదరాబాద్ వెళ్లి కొన్ని రోజులు ఉన్నాడు. ఆమె కలిసిన రోజున సాయంత్రం తాను స్నేహితులతో తిరుపతి వెళ్లినట్లు గీత కుమార్తెకు, ఆమె బంధువులకు చెప్పి నమ్మించాడు. గీత సెల్ ఫోన్‌ను చెన్నై తీసుకువెళ్లి అక్కడ కాలువలో పడేశాడు. అనంతరం పెద్దమనిషిలా తిరగసాగాడు. తన తల్లి కనిపించటం లేదంటూ ఆమె కుమార్తె 2021 డిసెంబరులో మహారాణపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు ఆచూకీ తెలియని (అన్‌డిటెక్టబుల్) కేసుగా మూసేశారు. ఈ క్రమంలో గీత కుమార్తె సునీత మళ్లీ ఈ నెల మొదటి వారంలో పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిని కలసి తన తల్లి అదృశ్యంపై విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరింది. దీనితో సీపీ ఇన్‌స్పెక్టర్ షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. పది రోజుల్లోనే ఆమె అదృశ్యం మిస్టరీని ప్రత్యేక బృందం ఛేదించింది. తగిన సాక్ష్యాధారాలు సేకరించి నిందితుడు అలుగు దివాకర్‌ను అరెస్టు చేశారు.

హరీష్‌కుమార్ అజేయ డబుల్ సెంచరీ

- కౌంటీ సీసీ విజయం



హరీష్‌కుమార్

విశాఖపట్నం స్పోర్ట్సు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం నిర్వహిస్తున్న వార్షిక తొలి డివిజన్ లీగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో భాగంగా శుక్రవారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కౌంటీ సీసీ 307 పరుగుల భారీ తేడాతో రాయల్ సీసీపై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కౌంటీ సీసీ నిర్ణీత 40 ఓవర్లలో రెండు వికెట్లకు 367 పరుగుల భారీ స్కోరు చేసింది. కె.హరీష్‌కుమార్ అద్భుతమైన బ్యాటింగ్‌తో అజేయ డబుల్ సెంచరీ (202 నాటౌట్) సాధించాడు. హరీష్‌కుమార్ విధ్వంసకర బ్యాటింగ్‌తో 12 సిక్సర్లు, 15 బౌండరీలు బాది డబుల్ సెంచరీతో చెలరేగాడు. దేవిసిష్ (75), చరణ్ తేజ్ (61) అర్ధ సెంచరీలతో తోడ్పాటు అందించారు. భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రాయల్ సీసీ 21.5 ఓవర్లలో కేవలం 60 పరుగులకు కుప్పకూలి ఘోర పరాజయం పాలైంది.

నేడు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సదస్సు

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న స్కిల్‌డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో శనివారం నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సదస్సు నిర్వహిస్తారు. ఈ సదస్సుకు ఐటీ, జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యా సంస్థల ప్రతినిధులు హాజరవుతారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సదస్సు జరుగుతుంది.

కరోనా వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రజారోగ్య వేదిక డిమాండ్ చేసింది. ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వేదిక ప్రతినిధులు లేఖ రాశారు. విశాఖలో కేసు నమోదైనందున ఆరోగ్యశాఖ అప్రమత్తమయ్యేలా చూడాలని కోరుతూ ప్రజారోగ్య వేదిక ప్రెసిడెంట్ డాక్టర్ ఎంవీ రమణయ్య, ప్రధాన కార్యదర్శి టి. కామేశ్వరరావు లేఖలో పేర్కొన్నారు. కేసుల పెరుగుదలను నివారించేందుకు అన్ని జిల్లా ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. మందుల నిల్వ, శిక్షణ పొందిన వైద్య సిబ్బందిని నియమించడంతోపాటు మాస్కులు, పరీక్ష కిట్‌లు, పీపీఈ కిట్‌లను సిద్ధంగా ఉంచాలన్నారు.

వీఎంఆర్డీఏ మాస్టర్‌ప్లాన్‌పై అభిప్రాయ సేకరణ

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏ రూపొందించిన మాస్టర్‌ప్లాన్-2041ను గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు తమకు అనుకూలంగా స్వప్రయోజనాల కోసం మార్పులు, చేర్పులు చేశారని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో ఆరోపించారు. అనుచిత లబ్ధిపొంది సామాన్యులను ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఈ విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. తప్పిదాలు సరిదిద్దేలా ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్ పునఃపరిశీలనకు అనుమతించిందని పేర్కొన్నారు. వచ్చే నెల 21 వరకు నగర పౌరులు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు నేరుగా లేదా పోస్టుద్వారా వీఎంఆర్డీఏ వెబ్‌సైట్ ద్వారా తెలియజేయవచ్చునని పేర్కొన్నారు.